



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 82 | బుధవారం 20 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## ఎరువుల సరఫరాకు గ్రీన్ సిగ్నల్!

- ఏడాదిగా నిలిచిపోయిన ఎగుమతులపై కీలక హామీ - రేర్ ఎర్త్ మినరల్స్, టన్నెల్ బోరింగ్ మెషీన్ల సరఫరాకు కూడా అంగీకారం
- విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీలో స్పష్టం చేసిన చైనా మంత్రి వాంగ్ యీ - అమెరికా విధానాల వల్లే రెండు దేశాలు దగ్గరవుతున్నాయన్న విశ్లేషణలు
- సరిహద్దు అంశాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ప్రత్యేక చర్చలు

న్యూఢిల్లీ -సూర్య వాస్తవం, ఆగస్టు 19

భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలలో కీలక పరిణామం చోటుచేసుకుంది. దాదాపు ఏడాది కాలంగా నిలిపివేసిన కీలకమైన వస్తువుల సరఫరాను పునరుద్ధరించేందుకు చైనా అంగీకరించింది. ముఖ్యంగా వ్యవసాయ - మిగతా 2లో..



## 'హరిహర వీరమల్లు' కోసం ప్రభుత్వ నిధులు?..

- పవన్ కల్యాణ్‌పై హైకోర్టులో పిటిషన్
- డిప్యూటీ సీఎం పవన్‌పై నిధుల దుర్వినియోగం ఆరోపణలు
- 'హరిహర వీరమల్లు' సినిమా ప్రమోషన్ కోసం ప్రభుత్వ సొమ్ము వాడారని ఆరోపణ
- హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మాజీ ఐఏఎస్ అధికారి

అమరావతి-సూర్య వాస్తవం, ఆగస్టు 19

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు ఏపీ హైకోర్టులో ఊహించని పరిణామం ఎదురైంది. ఆయనపై దాఖలైన ఓ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. పవన్ - మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### ఇండియా కూటమి అధికారంలోకి వస్తే

## సీఈసీపై చర్యలు

- బీహార్‌లోని గయలో కీలక వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ
- ప్రతి అసెంబ్లీ, లోక్ సభ స్థానంలో ఎన్నికల సంఘం లోపాలను ప్రజల ముందు ఉంచుతామని వివరణ
- ప్రజలే ఈసీని అఫిడవిట్ ఇవ్వాలని అడుగుతారన్న రాహుల్



అమరావతి-సూర్య వాస్తవం, ఆగస్టు 19

ఓటర్ అధికార్ యాత్రలో భాగంగా బీహార్‌లోని గయలో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని, - మిగతా 2లో..

### మిస్ యూనివర్స్ ఇండియా 2025'గా

## మణిక విశ్వకర్మ

- మిస్ యూనివర్స్ ఇండియా 2025 విజేతగా రాజస్థాన్ యువతి
- జైపూర్‌లో ఘనంగా జరిగిన తుది పోటీలు
- థాయ్‌లాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం
- ఫస్ట్ రన్నరప్‌గా తాన్యా శర్మ, సెకండ్ రన్నరప్‌గా మెహక్ ధింగ్రా



అమరావతి-సూర్య వాస్తవం, ఆగస్టు 19

ప్రతిష్ఠాత్మక మిస్ యూనివర్స్ ఇండియా 2025 కిరీటం రాజస్థాన్‌కు చెందిన మణిక విశ్వకర్మను వరించింది. సోమవారం రాత్రి జైపూర్‌లో అట్టహాసంగా జరిగిన ఫైనల్స్‌లో ఆమె విజేతగా నిలిచారు. గత ఏడాది విజేత రియా సింఘా, మణికకు కిరీటాన్ని - మిగతా 2లో..

### ఎన్‌టిఆర్ స్ఫూర్తితో

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వండి

### - తెలుగు రాష్ట్రాల్లోని పార్టీలకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్ -సూర్య వాస్తవం, ఆగస్టు 19

సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తెలుగు బిడ్డ రాజ్యాంగ, న్యాయకోవిదుడు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా వేదిక ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగు ప్రజల గౌరవ ప్రతిష్టలను మరింత పెంచిందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన జూబ్లిహిల్స్‌లోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రపంచంతో పోటీపడేలా దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దిన ప్రధాని పివి నర్సింహారావు తర్వాత తెలుగువారికి ఇలాంటి అవకాశం రావడం గొప్ప పరిణామమని రేవంత్ చెప్పారు. ప్రధానిగా పివి నరసింహారావుకు అవకాశం వచ్చినప్పుడు సిద్ధాంతపరంగా ఎన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికీ తెలుగువారికి



దక్కిన గొప్ప అవకాశంగా భావించి ఆయనకు అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు - మిగతా 2లో..



### దళిత సమాజానికి

## అంతర్గత రిజర్వేషన్లు

- ఎడమచేతి వాటం, కుడిచేతి వాటం వారికి 6శాతం, ఇతరులకు 5శాతం
- ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు-సూర్య వాస్తవం, ఆగస్టు 19

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో మంగళవారం జరిగిన ప్రత్యేక మంత్రివర్గ సమావేశంలో దళిత వర్గానికి అంతర్గత రిజర్వేషన్ దాదాపుగా ఖరారు చేయబడింది. సీఎం సిద్ధరామయ్య నేడు సభలో దీనిని ప్రకటించ నున్నారు. షెడ్యూల్డ్ కులాలన్నింటినీ విశ్వాసంలోకి తీసుకుని శాస్త్రీయంగా అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించారు మరియు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రేపు ఆగస్టు 20న సభలో దీనిని ప్రకటిస్తారు. 2లో

## పేదల ఆరోగ్య పరిరక్షణకు సంజీవని

- బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహకారంతో త్వరలో కొత్త పథకం
- బంగారు కుటుంబాలకు మార్గదర్శకుల చేయూత అవసరం
- పీ-4 అమలు సదస్సులో సిఎం చంద్రబాబు

గుంటూరు -సూర్య వాస్తవం, ఆగస్టు 19

రాష్ట్రంలోని పేదల ఆరోగ్య పరిరక్షణకు సంజీవని పేరుతో కొత్త పథకం అమలు చేయనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గుంటూరు జిల్లా మంగళగిరి సికె కన్వెన్షన్ హాలులో మంగళవారం జరిగిన పి-4 సదస్సులో ఆయన ప్రసంగించారు. పలువురు మార్గదర్శకులతోనూ, బంగారు కుటుంబాలకు చెందిన పేదలతోనూ ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పి-4 ద్వారా పేదలకు మేలు చేయాలన్న తన సంకల్పాన్ని ఆచరణలో చేసి చూపిస్తానన్నారు. ఈ నెలాఖారుకు 15 లక్షల బంగారు కుటుంబాలకు సాయం అందించేలా లక్షన్నర మంది మార్గదర్శకులను ఎంపిక చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 13,47,697 కుటుంబాలకు 1,41,977 మార్గదర్శకులను అనుసంధానం చేశామని తెలిపారు. పి-4 విజయవంతం అయిన వెంటనే త్వరలోనే ప్రజల ఆరోగ్య సమస్యలపై దృష్టి పెడతానన్నారు. బిలిగేట్స్ ఫౌండేషన్‌తో చర్చించి ప్రపంచంలో ఎన్ని రకాల నైపుణ్యం, నాలెడ్జిలతో అనుసంధానం చేసి ప్రజలకు



సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే సంజీవనిని తెస్తానని ప్రకటించారు. పేద, మధ్య తరగతి కోసం ఇప్పటికే ఆరోగ్య శ్రీ, సిఎం సహాయ నిధి, కేంద్రం అమలు చేస్తోన్న పలు పథకాలతోపాటు ఇంకా మెరుగ్గా ఆరోగ్య పరిరక్షణకు త్వరలో అన్ని రకాల అంశాలతో కలిపి సంజీవని పథకం తీసుకురానున్నట్టు వివరించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించడమే తన జీవిత ఆశయమన్నారు. పేదలను ఆదుకునే మార్గదర్శకులు కేవలం - మిగతా 2లో..



### కేంద్రానిది ఆపరేషన్

## సైలెంట్ కిల్లింగ్

- విశాఖ స్టీల్‌ను ఉద్ధరిస్తామన్న మాటలు పచ్చి అబద్ధమన్న వైఎస్ షర్మిల
- 44 ఈవోఐలకు ప్రైవేట్ కాంట్రాక్టర్లను పిలవడం ప్లాంట్‌ను చంపే కుట్రలో భాగమేనన్న షర్మిల
- మోదీ దోస్తుల చేతుల్లో స్టీల్ ప్లాంట్‌ను పెట్టాలని చూస్తున్నారన్న షర్మిల 2లో

### ఇండియా కూటమి అధికారంలోకి వస్తే

# సీఈసీపై చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్‌ను ఆయన తీవ్రంగా విమర్శించారు. ఓట్ల అవకతవకల వ్యవహారం వెలుగు చూసినప్పటికీ ఈసీ ఇంకా తనను అఫిడవిట్ దాఖలు చేయాలని కోరుతోందని ఆయన ఎద్దేవా చేశారు. కొంత సమయం ఇస్తే ప్రతి అసెంబ్లీ, లోక్‌సభ స్థానంలో ఎన్నికల సంఘం లోపాలను ప్రజల ముందు ఉంచుతామని, దాంతో వారే ఈసీని అఫిడవిట్ ఇవ్వాలని అడుగుతారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

ప్రధాని మోదీ స్పెషల్ ప్యాకేజీ గురించి మాట్లాడినట్లే, ఈసీ కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట బీహార్ కోసం ప్రత్యేక ప్యాకేజీ తీసుకొచ్చిందని, ఇది ఓట్ల చోరీకి కొత్త రూపమని విమర్శించారు. బీహార్ ప్రజలు ఇది జరగనివ్వరని అన్నారు. బీహార్‌లో, కేంద్రంలో ఇండియా కూటమి ఏర్పడే రోజు వస్తుందని, అప్పుడు ఓట్ల చోరీ వ్యవహారంలో ప్రమేయం ఉన్న సీఈసీతో పాటు ఎన్నికల కమిషనర్లపైనా చర్యలు తీసుకుంటామని రాహుల్ హెచ్చరించారు. అంతకు ముందు ఔరంగాబాద్ జిల్లాలో ఓట్లు కోల్పోయిన పౌరులతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. అందుకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. గత నాలుగైదు ఎన్నికల్లో ఓట్లు వేసిన వారి ఓట్లను కూడా చోరీ చేశారన్నారు. తాము పేదల హక్కుల కోసం పోరాడుతున్నామని, ఓట్ల చోరీకి అడ్డుకట్ట వేస్తామని రాహుల్ పేర్కొన్నారు.

### మిస్ యూనివర్స్ ఇండియా 2025'గా

# మణిక విశ్వకర్మ

(మొదటిపేజీ తరువాయి)

అలంకరించారు. ఈ విజయంతో మణిక ఈ ఏడాది నవంబర్‌లో థాయ్‌లాండ్‌లో జరగనున్న 74వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇదే పోటీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన తాన్యా శర్మ ఫస్ట్ రన్నరప్‌గా, హర్యానాకు చెందిన మెహక్ ధింగ్రా సెకండ్ రన్నరప్‌గా, అమిషి కౌశిక్ థర్డ్ రన్నరప్‌గా నిలిచారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి మణిక**

రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌కు చెందిన మణిక ప్రస్తుతం ఢిల్లీలో నివసిస్తున్నారు. పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్‌లో చివరి సంవత్సరం చదువుతున్న ఆమె, చిన్న వయసులోనే బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. ఆమె శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందారు. పెయింటింగ్‌లోనూ అద్భుతమైన నైపుణ్యం ఉంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన 'బిమ్‌స్టెక్ సెవోకాన్' కార్యక్రమంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. లలిత కళా అకాడమీ, జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నుంచి కూడా గౌరవాలు అందుకున్నారు. కేవలం కళలు, చదువుకే పరిమితం కాకుండా, సామాజిక అంశాలపై కూడా మణిక ప్రత్యేక దృష్టి సారించారు. న్యూరోడైవర్జెన్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'న్యూరోనోవా' అనే సంస్థను ఆమె స్థాపించారు. ఏడీహెచ్‌డీ వంటి సమస్యలను లోపాలుగా కాకుండా, ప్రత్యేకమైన మేధోశక్తులుగా చూడాలని ఆమె తన ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రచారం చేస్తున్నారు.

విజయం అనంతరం మణిక మాట్లాడుతూ.. "నా ప్రస్థానం నా సొంత ఊరు గంగానగర్ నుంచి మొదలైంది. ఢిల్లీ వచ్చి ఈ పోటీల కోసం సిద్ధమయ్యాను. మనలో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంచుకోవాలి. నా ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉంది. నాకు సహాయం చేసి, నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. పోటీలు కేవలం ఒక రంగం కాదు, అవి వ్యక్తిత్వాన్ని నిర్మించే ఒక ప్రపంచం" అని ఆమె తన ఆనందాన్ని పంచుకున్నారు.

# ఎరువుల సరఫరాకు గ్రీన్ సిగ్నల్!

(మొదటిపేజీ తరువాయి)

రంగానికి అత్యంత అవసరమైన ఎరువులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వాడే టన్నెల్ బోరింగ్ మెషీన్లు (టీబీఎం), ఆటోమొబైల్ రంగానికి అవసరమైన రేర్ ఎర్త్ మినరల్స్ ఎగుమతులను తిరిగి ప్రారంభించనున్నట్టు స్పష్టం చేసింది.

భారత్ పర్యటనలో ఉన్న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ సోమవారం మన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ హామీ ఇచ్చారు. గత నెలలో జైశంకర్ చైనా పర్యటనకు వెళ్లినప్పుడు యూరియా, ఎన్‌పీకే, డీఏపీ వంటి ఎరువులతో పాటు ఇతర కీలక వస్తువుల సరఫరా నిలిచిపోయిన విషయాన్ని లేవనెత్తారు. దీనికి సానుకూలంగా స్పందించిన చైనా, తాజాగా ఈ నిర్ణయం తీసుకోవడం ఇరు దేశాల మధ్య సంబంధాలు తిరిగి సాధారణ స్థితికి వస్తున్నాయనడానికి సంకేతంగా భావిస్తున్నారు. భారత్ తన ఎరువుల అవసరాల్లో దాదాపు 30 శాతం చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో ఈ పరిణామం మన దేశానికి ఎంతో ఊరటనిచ్చే అంశం. ఈ భేటీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై పరోక్షంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వాషింగ్టన్ తీసుకుంటున్న నిర్ణయాలు భారత్, చైనా రెండింటినీ లక్ష్యంగా చేసుకుంటున్నాయని, ఈ అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కోవాలంటే ఇరు దేశాలు పరస్పరం చర్చించుకుంటూ దగ్గరగా మెలగడం అవసరమని ఇరుపక్షాలు అభిప్రాయపడినట్లు సమాచారం.

అయితే, జైశంకర్-వాంగ్ యీ సమావేశంలో కేవలం వాణిజ్య అంశాలపైనే దృష్టి సారించారు. సరిహద్దు వివాదాల ప్రస్తావన రాలేదు. ఈ సున్నితమైన అంశంపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ నేడు చైనా ప్రత్యేక ప్రతినిధులతో చర్చలు జరపనున్నారు. 3,488 కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి బలగాల ఉపసంహరణే ఈ చర్చల్లో ప్రధాన అజెండాగా ఉండనుంది. తైవాన్ విషయంలో మాత్రం భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, కేవలం ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల కోసమే దౌత్యపరమైన కార్యకలాపాలు కొనసాగిస్తున్నామని జైశంకర్ స్పష్టం చేశారు. ఈ సాయంత్రం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కూడా భేటీ కానున్నారు.

### 'హరిహర వీరమల్లు' కోసం

# ప్రభుత్వ నిధులు?..

(మొదటిపేజీ తరువాయి)

కల్యాణ్ తన సినిమా ప్రమోషన్ కోసం ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ దాఖలైన ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు కోర్టు అంగీకరించింది. వివరాల్లోకి వెళితే, మాజీ ఐఏఎస్ అధికారి ఎస్. విజయ్ కుమార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా ప్రచార కార్యక్రమాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిధులను వాడుకున్నారని ఆయన తన పిటిషన్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. విజయ్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు, దానిని విచారణకు స్వీకరిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణ జాబితాలో సీబీఐ, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) న్యాయవాదుల పేర్లను కూడా చేర్చాలని కోర్టు రిజిస్ట్రీకి సూచించింది. అనంతరం, తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కల్యాణ్ సినిమాకు సంబంధించి ఇలాంటి పిటిషన్ దాఖలు కావడం, దానిని హైకోర్టు విచారణకు స్వీకరించడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

### టీడీపీ మాజీ ఎమ్మెల్సీ

# మంతెనకు కీలక పదవి

**- ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్తగా నియమితులైన మంతెన సత్యనారాయణ రాజు**

**- నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ విజయానంద్ - సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన సత్యనారాయణ రాజు**



**అమరావతి-సూర్య వాస్తవం, ఆగస్టు 19**

టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్య నారాయణ రాజు ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వ యకర్తగా నియమితులయ్యారు. ఆయనకు సహాయ మంత్రి హోదా కల్పించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని జీఏడీ, ప్రోటోకాల్ డైరెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా టీడీపీలో క్రియా శీలకంగా పని చేసిన సత్యనారాయణ రాజు 2017-2023 మధ్య కాలంలో ఎమ్మెల్సీగా పని చేశారు. పార్టీలో వివిధ పదవులు నిర్వహించారు. 2007-2013 మధ్య కాలంలో తెలుగు యువత కార్యదర్శిగా, ఆ తర్వాత 2013లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరించి పార్టీ అధినేత చంద్రబాబు అప్పజెప్పిన పనులను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సమయంలో చంద్రబాబు నిర్వహించిన 'మీ కోసం' పాదయాత్రలో రాజు వాలంటీర్ల సమన్వయకర్తగా పని చేశారు.

శాసనమండలిలో ప్రజా సమస్యలను, పార్టీ గళాన్ని గట్టిగా వినిపించారు. గత వైసీపీ హయాంలో శాసనమండలిలో నారా లోకేశ్ నేతృత్వంలో మూడు రాజధానుల బిల్లు పాస్ కాకుండా అడ్డుకోవడంలో సత్యనారాయణ రాజు తన వంతు పాత్ర పోషించారు. అంతే కాకుండా శాసన మండలిలో నారా లోకేశ్ మీదకు నాటి అధికార పార్టీ నేతలు దూసుకొచ్చిన సమయంలో ఆయనపై దాడి జరగకుండా ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్‌తో కలిసి అడ్డుకున్నారు. ఇక 2022 నుంచి పార్టీ కార్యక్రమాల సమన్వయకర్తగా వ్యవహరిస్తూ వచ్చారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల సమన్వయకర్తగానూ వ్యవహరించారు. లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో కీలక భూమిక పోషించారు. చంద్రబాబు నాయుడు పాల్గొన్న 2024 ఎన్నికల సభలను కూడా మంతెన కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. పార్టీకి అత్యంత విధేయుడిగా ఉన్న రాజును తన కార్యక్రమాల సమన్వయకర్తగా చంద్రబాబు నియ మించారు. తనను సమన్వయకర్తగా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సత్యనారాయణ రాజు ధన్య వాదాలు తెలిపారు. సీఎం ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. మరోవైపు సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా నియ మితులైన సత్యనారాయణరాజుకు పలువురు ప్రజా ప్రతినిధులు, నేతలు అభినందనలు తెలియజేస్తున్నారు.

# పేదల ఆరోగ్య పరిరక్షణకు సంజీవని

(మొదటిపేజీ తరువాయి)

ధన సాయం చేస్తే సరిపోదని, వారి జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు కూడా పరిష్కారం చూపాలని సూచించారు. రాష్ట్రంలో కోటీ 69 లక్షల కుటుంబాలు ఉన్నాయని, వీరిలో 21 లక్షల మంది పేదలను గుర్తించామని తెలిపారు. మార్గదర్శకులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాల వారు అందిపుచ్చుకుని సమాజంలో ఎదగాలని కోరారు. పి-4 ఆచరణ సాధ్యం కాదని కొంతమంది ప్రచారం చేస్తున్నారని, కానీ తాను ఆచరణ సాధ్యమేనని నమ్ముతున్నానని తెలిపారు. సంపద సృష్టిస్తామని, తద్వారా ఆదాయం పెరగాలని అన్నారు. సంపద ఒకే చోట కేంద్రీకృతం కాకుండా పేద వారికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో డొక్కా సీతమ్మ వంటి మహిళలు ఎన్నో ఏళ్ల క్రితమే బాటసారులకు ఉచితంగా భోజనం వండి వడ్డించారని గుర్తు చేశారు. తనకు సంపద లేకున్నా ఇతరులకు దానం చేసే గుణం తెలుగువారిలో ఎప్పటి నుంచో ఉందని వివరించారు. ప్రస్తుత బంగారు కుటుంబాలవారు భవిష్యత్తులో మార్గదర్శకులుగా మారతారని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం కోసం ఇప్పటికే అనేక పథకాలు అమలు చేస్తున్నామని, అయినా ఇంకా పేదరికం కొనసాగుతోందని తెలిపారు. సేవతో తృప్తి, సాయంతో సంతృప్తి ఉంటాయన్నారు. కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను చంద్రబాబు దత్తత తీసుకున్నారు. దీనికి చిహ్నంగా 'అడాప్ట ట్రీ' నమూనాను కుప్పంలోని బంగారు కుటుంబాల వారికి ఆయన ఈ వేదికపై అందజేశారు. పి-4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ సి.కుటుంబరావు, ఎన్ఆర్‌టి చైర్మన్ వేమూరి రవికుమార్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రానిది ఆపరేషన్

# సైలెంట్ కిల్లింగ్

**- విశాఖ స్టీల్‌ను ఉద్ధరిస్తామన్న మాటలు పచ్చి అబద్ధమన్న వైఎస్ షర్మిల**

**- 44 ఈవోఐలకు ప్రైవేట్ కాంట్రాక్టర్లను పిలవడం ప్లాంట్‌ను చంపే కుట్రలో భాగమేనన్న షర్మిల**

**- మోదీ దోస్తుల చేతుల్లో స్టీల్ ప్లాంట్‌ను పెట్టాలని చూస్తున్నారన్న షర్మిల**

**అమరావతి-సూర్య వాస్తవం, ఆగస్టు 19**

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రానికి ఇది "ఆపరేషన్ సైలెంట్ కిల్లింగ్" అని వ్యాఖ్యానించిన ఆమె, విశాఖ స్టీల్‌ను ఉద్ధరిస్తామన్న మాటలు పచ్చి అబద్ధమని మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా షర్మిల కేంద్రం ప్రైవేటీకరణ కుట్రను తీవ్రంగా ఎండగట్టారు. 'ఉద్ధరించడం అంతా బూటకం. ప్రైవేటీకరణ లేదంటూనే ప్లాంట్‌లో 44 ఈఓఐలకు ప్రైవేట్ కాంట్రాక్టర్లను పిలవడం దారుణం. ఇది ప్లాంట్‌ను చంపే కుట్రలో భాగమే' అని ఆమె పేర్కొన్నారు. అలాగే, ఇటీవల ఐదు వేల మంది కార్మికుల తొలగింపు విషయంలో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 5 వేల మంది కార్మికులను ఎందుకు తొలగించారు? ఆ పనులను ఎందుకు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెడుతున్నారు అని ప్రశ్నించారు. పూర్వ వైభవం అంటూ ఇదెక్కడి ద్వంద్వ వైఖరి అని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యపు దుర్మార్గపు చర్యకు ఇది నిదర్శనమని ఆమె అన్నారు. ఇది కూటమి ప్రభుత్వ చేతగానితనానికి అద్దం పడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ దర్శకత్వంలో ప్లాంట్‌ను దశలవారీగా నాశనం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. మోదీ దోస్తుల చేతుల్లో స్టీల్ ప్లాంట్‌ను పెట్టాలని చూస్తున్నారని, దానికి చంద్రబాబు మద్దతు ఇస్తున్నారని అన్నారు. ప్లాంట్‌లో ప్రైవేట్ కాంట్రాక్టర్లను ఆహ్వానించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. తాజాగా ఇచ్చిన 44 ఈఓఐలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, తొలగించిన ఐదు వేల మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యాన్ని వెనక్కి తీసుకునే విషయంలో స్టీల్ ప్లాంట్ కార్మికుల పక్షాన కాంగ్రెస్ మరో దశ పోరాటానికి సిద్ధమవుతుందని ఆమె హెచ్చరించారు.

### ఎన్‌టిఆర్ స్ఫూర్తితో

# జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

మద్దతు తెలిపి తన రాజకీయ విజ్ఞతను ప్రదర్శించారని కొనియాడారు. ఎన్‌టిఆర్ స్ఫూరితో ఇప్పుడు సుదర్శన్ రెడ్డి విజయానికి కెసిఆర్ (బిఆర్ఎస్), చంద్రబాబునాయుడు (టిడిపి), పవన్ కల్యాణ్ (జనసేన), వైఎస్ జగన్ (వైసిపి), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), వామపక్ష పార్టీలు సహకరించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని బిజెపి ఎంపిలు ఆత్మప్రబోధానుసారంగా ఓటేసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తోన్న ప్రధాని మోడీ ప్రతినిధి సిపి.రాధాకృష్ణన్ అని విమర్శించారు. సుదర్శన్‌రెడ్డి గెలిస్తే రాజ్యాంగం రక్షించబడుతుందన్నారు.

### దళిత సమాజానికి

# అంతర్గత రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ నాగమోహన్ దాస్ నివేదికలో 5 విభాగాలు ఉన్నాయి. కానీ ప్రభుత్వం దానిని 3 గ్రూపులుగా వర్గీకరించింది. దీని ప్రకారం, 18 కులాలు ఉన్న ఎడమచేతి వాటం సమాజానికి 6 శాతం రిజర్వేషన్లు, 20 కులాలు ఉన్న కుడిచేతి వాటం సమాజానికి 6 శాతం రిజర్వేషన్లు. 63 కులాలు ఉన్న ఇతర వర్గాలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయాన్ని కేబినెట్ సమావేశం దాదాపుగా ఖరారు చేసింది.

### అక్రిడేషన్ల మంజూరుకు

# మార్గదర్శకాలు జారీ

**అమరావతి-సూర్య వాస్తవం, ఆగస్టు 19**

అమరావతి రాష్ట్ర ప్రభుత్వం మీడియా అక్రిడేషన్లు మంజూరు చేసేందుకు మార్గ దర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అక్రిడేషన్ రూల్స్ - 2025'ను అమోదించింది. అక్రిడేషన్ల మంజూరు చేసేందుకు రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో అక్రిడేషన్ కమిటీల ఏర్పా టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీకి చైర్మన్‌గా సమాచార పౌర సంబందాల శాఖ డైరెక్టర్ వ్యవహరిస్తారని, రిజిస్టర్ జర్నలిస్ట్ సంఘాలు నుంచి 5 గురు సభ్యులు, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న పత్రికల సంఘాల నుంచి ఇద్దరు సభ్యు లు, ఫోటో జర్నలిస్టుల సంఘం నుంచి ఒకరికి ప్రాతినిధ్యం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అక్రిడేషన్ మంజూరుకు విధివిధానాలు, కమిటీల్లో సభ్యులుగా ఎంపిక చేసే యూనియన్లకు ఉండాల్సిన అర్హతలు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# సంపాదకీయం

## దేశగతిని మార్చనున్న ఖనిజాలు




ఓవైపు బంగారం.. మరో వైపు పెట్రోలియం .. ఈ రెండు దేశగతిని మార్చేయబోతున్నాయి. భారత దేశం 80 శాతం పెట్రోలియం ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటుంది. కేవలం 20 శాతం మాత్రమే మన దేశంలో లభిస్తోంది. అలాగే బంగారం కూడా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ప్రపంచంలో బంగారం ఎక్కువగా వినియోగించే దేశాల్లో భారత్ ఒకటి. ఈ దిగుమతుల కారణంగా మన రూపాయి విలువ తగ్గుతోంది. విదేశా మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో భారత ఆర్థిక వ్యవస్థకు ఊపిరిపోసేలా భారీ బంగారు నిల్వలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జేఎస్ఐ) గుర్తించింది. ఇది దేశ ఆర్థిక రంగంలో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో సుమారు 20 మెట్రిక్ టన్నుల బంగారు నిల్వలు ఉన్నట్లు అంచనా. ఇది బంగారం దిగుమతులపై ఆధారపడే భారత్‌కు ఊరట కలిగించే అంశం. ఒడిశా ప్రభుత్వం ఇప్పటికే మైనింగ్ పనులను ప్రారంభించి, త్వరలో వేలం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఒడిశాలోని నాలుగు జిల్లాల్లో 20 మెట్రిక్ టన్నుల బంగారు నిల్వలను గుర్తించింది. ఈ నిల్వలు దేశంలో బంగారం ఉత్పత్తిని పెంచి, విదేశీ దిగుమతులపై ఆధారపడే తీవ్రతను తగ్గించే అవకాశం ఉంది. భారత్ ఏటా భారీ మొత్తంలో బంగారాన్ని దిగుమతి చేస్తుంది. ఇది విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని పెంచుతుంది. అధికారిక గణాంకాలు ఇంకా అందుబాటులో లేవు. అయితే, ప్రాథమిక అంచనాల ప్రకారం బంగారు నిల్వలు 10 నుండి 20 మెట్రిక్ టన్నుల వరకు ఉండవచ్చని సూచిస్తున్నాయి. భారతదేశం మొత్తం బంగారు దిగుమతులతో పోలిస్తే ఇది చిన్నదే అయినప్పటికీ, దేశీయ బంగారు ఉత్పత్తిని పెంచే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు.ఒడిశా ప్రభుత్వం, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్, ఊఎ ఈ ఆవిష్కరణను వాణిజ్యీకరించడానికి వేగంగా పనిచేస్తున్నాయి. దేవ్‌ఘర్ జిల్లాలోని మొదటి బంగారు మైనింగ్ బ్లాక్ వేలానికి సిద్ధమవుతోంది. నిక్షేపం నాణ్యత, దాని మైనింగ్ సామర్థ్యాన్ని నిర్ధారించడానికి ఉ3 నుండి ఉ2 స్థాయిల వరకు వివరణాత్మక డ్రిల్లింగ్, నమూనా సేకరణ జరుగుతోంది.ఈ బంగారు నిక్షేపాన్ని వాణిజ్యపరంగా తవ్వితే, స్థానిక ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, ఉపాధి, సేవల విస్తరణకు వీలు కల్పిస్తుంది. భారతదేశం బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. ఒడిశాను ఇనుప ఖనిజం, బాక్సైట్‌లకు మాత్రమే కాకుండా బంగారు కేంద్రంగా గుర్తించవచ్చు. ఒడిశాలో ఇప్పటికే భారతదేశంలోని క్రోమైట్‌లో 96శాతం, బాక్సైట్‌లో 52శాతం ఇనుప ఖనిజ నిల్వలు 33శాతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా బంగారు గనులు కూడా ఈ లిస్ట్‌లోకి వచ్చి చేరాయి.దర్యాప్తు, ప్రయోగశాల విశ్లేషణ తుది నివేదిక అందాల్సి ఉంటుంది. ఆ తర్వాత సాంకేతిక కమిటీల ద్వారా వాణిజ్య సాధ్యాసాధ్యాల మూల్యాంకనం చేస్తారు. పారదర్శక వేలం, పెట్టుబడి ఆకర్షణ. పర్యావరణ, సామాజిక ప్రభావ అధ్యయనం చేస్తారు. మొత్తంమీద ఒడిశాలో ఈ బంగారు నిక్షేపాల ఆవిష్కరణ భారతదేశ మైనింగ్ వ్యూహంలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించగలదు. స్థానిక ప్రజలకు ఆర్థికంగా వరం కాగలదు.స్థానిక ఉత్పత్తి ద్వారా ఈ భారం తగ్గవచ్చు. మైనింగ్ కార్యకలాపాలు స్థానికులకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి, ఒడిశా ఆర్థిక వృద్ధికి దోహదపడతాయి. ఒడిశా ప్రభుత్వం ఈ బంగారు నిల్వలను సద్వినియోగం చేసుకునేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. మైనింగ్ పనులు ప్రారంభించడంతోపాటు, త్వరలో వేలం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. పారదర్శకమైన వేలం విధానం ద్వారా సమర్థవంతమైన కంపెనీలకు మైనింగ్ హక్కులు కేటాయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చు. ఆధునిక మైనింగ్ సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. మైనింగ్ ఆదాయాన్ని ఒడిశాలో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి వినియోగించవచ్చు.భారత్ ప్రపంచంలో అతిపెద్ద బంగారం దిగుమతి దేశాల్లో ఒకటి. 2024లో భారత్ దాదాపు 800 మెట్రిక్ టన్నుల బంగారాన్ని దిగుమతి చేసినట్లు అంచనా. ఒడిశాలో 20 మెట్రిక్ టన్నుల నిల్వలు ఈ దిగుమతి భారాన్ని కొంతమేర తగ్గించవచ్చు. స్థానిక ఉత్పత్తి ద్వారా విదేశీ మారక ఖర్చు తగ్గడం వల్ల రూపాయి విలువ స్థిరీకరణకు దోహదం చేస్తుంది. స్థానిక ఉత్పత్తి పెరిగితే, దేశీయ మార్కెట్లో బంగారం ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. భవిష్యత్తులో అధిక ఉత్పత్తి సాధ్యమైతే, భారత్ బంగారం ఎగుమతి దేశంగా మారే అవకాశం ఉంది.

# ఐటీ విప్లవ పితామహుడు రాజీవ్ గాంధీ

## -నేడు భారత మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ జయంతి

రాజీవ్ గాంధీ ముందుచూపు వల్లే భారతదేశం ఇప్పుడు ఆర్థిక, సాంకేతిక రంగాల్లో పటిష్టంగా మారింది. స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, యువతకు 18ఏండ్లకే ఓటు హక్కు కల్పించడం వంటి నిర్ణయాలు కూడా రాజీవ్ గాంధీ హయాంలో తీసుకున్నవే...

భారతదేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ మరియు ఫిరోజ్ గాంధీ ల పెద్ద కుమారుడు రాజీవ్ గాంధీ, భారతదేశ 7వ ప్రధానమంత్రి (గాంధీ - నెహ్రూ కుటుంబం నుండి మూడవ వాడు). 1984 , అక్టోబరు 31 న తల్లి మరణముతో ప్రధానమంత్రి అయిన రాజీవ్ 1989 , డిసెంబరు 2 న సాధారణ ఎన్నికలలో పరాజయము పొంది, రాజీనామా చేసే వరకు ప్రధానమంత్రిగా పనిచేశాడు. 40 సంవత్సరాల వయసులో ప్రధానమంత్రి అయిన రాజీవ్ గాంధీ భారత ప్రధానమంత్రి అయిన అతి పిన్న వయస్కుడు. శ్రీలంక దేశానికి చెందిన తమిళ తీవ్రవాదులు (ఎల్.టి.టి.ఈ) చేసిన మానవ బాంబు దాడిలో మరణించాడు. 1944వ సంవత్సరంలో ఇందిరాగాంధీ - ఫిరోజ్‌గాంధీ దంపతులకు పెద్ద కుమారునిగా ఆగస్టు 20,1944న రాజీవ్ గాంధీ జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని డెహ్రాడూన్‌లో పూర్తి చేసిన రాజీవ్, ఉన్నత విద్యాభ్యాసం ఇంగ్లండ్‌లో పూర్తి చేశారు. తరువాతి కాలంలో తను అత్యంత అభిమానించే 'ఫ్లైయింగ్' రంగంలో శిక్షణ పొందిన రాజీవ్‌గాంధీ, ఇండియన్ ఎయిర్ లైన్స్‌లో పైలట్‌గా తన ఉద్యోగజీవితాన్ని ప్రారంభించారు. ఇంగ్లండ్‌లో చదువుతున్న సమయంలోనే రాజీవ్ ఇటాలియన్ యువతి అయిన సోనియాను ప్రేమించడం, తరువాతి కాలంలో పెళ్ళి చేసుకోవడం జరిగింది. మొదట్లో ఇందిరాగాంధీ రాజకీయ వారసుడుగా సంజయ్‌గాంధీనే అని అందరూ భావించారు. అదే విధంగా రాజకీయ వ్యవహారాలలోనూ, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలలోనూ, పరిపాలనా వ్యవహారాలలోనూ సంజయ్‌గాంధీ జోక్యం అధికంగా వుండేది. రాజీవ్‌గాంధీ మాత్రం చిన్ననాటి నుండి రాజకీయాల



పట్ల పెద్దగా ఆసక్తి కనబరచేవారు కాదు. అందుకే రాజీవ్ తనకిష్టమైన రంగంలో ప్రవేశించి పైలెట్‌గా ఉద్యోగం చేయనారంభించారు. 1980వ సంవత్సరంలో ఒక ప్రమాదంలో సంజయ్‌గాంధీ మరణించారు. దాంతో ఇందిరాగాంధీ రాజీవ్‌గాంధీని తన రాజకీయవారసునిగా చేయాలని భావించి రాజీవ్‌ను పరిపాలనా వ్యవహారాలలో తనకు తోడుగా వుండమని కోరడం జరిగింది. భార్య సోనియాగాంధీ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, తల్లి కోరిక మేరకు రాజీవ్‌గాంధీ రాజకీయరంగ ప్రవేశం చేశారు. 1984వ సంవత్సరం అక్టోబర్ నెలలో తన అంగరక్షకుల చేత ఇందిరా గాంధీ హత్య గావించబడడంతో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాజకీయాల పట్ల ఆసక్తి లేకపోవడంతో చాలాకాలం పాటు రాజకీయాలకు దూరంగా వుండటం, అనుభవం లేకపోవడం వంటి కారణాల వల్ల రాజీవ్‌గాంధీ ఎక్కువ కాలం పరిపాలన సాగించలేడని అందరూ భావించారు. కానీ, వారందరి నమ్మకాలను వమ్ము చేసే విధంగా రాజీవ్ పూర్తికాలం పదవిలో కొనసాగడమేకాక, పరిపాలనా పరంగా పలుమార్పులు తీసుకురావడమే కాక, ఆధునిక రీతికి తగ్గట్లుగా పాలించి అందరి అభిమానాన్ని చూరగొన్నారు రాజీవ్. భారతదేశానికి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన అత్యంత పిన్నవయస్కునిగా చరిత్ర సృష్టించారు రాజీవ్‌గాంధీ. ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంభవిస్తున్న మార్పులకనుగుణంగా భారతదేశాన్ని ముందుకు నడిపించిన సమర్థనాయకుడు రాజీవ్‌గాంధీ. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగ ఆవశ్యకతను, భవిష్యత్తులో అది పోషించబోయే పాత్రను ముందుగానే ఊహించిన రాజీవ్ గాంధీలోని దార్శనికుడు, ఆ రంగానికి ప్రాధన్యమిచ్చాడు. కానీ, 'బోఫోర్స్' కంపెనీ నుండి ఆయుధాలు కొనడంలో భారీ అవకతవకలకు పాల్పడ్డారని అవినీతి ఆరోపణలు రాజీవ్‌గాంధీ ఎదుర్కోవడం వంటి కారణాల వల్ల 1989వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓటమి ఎదుర్కోవలసి వచ్చింది. వి.పి.సింగ్ ప్రధానమంత్రిగా 'జనతాదళ్' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ పూర్తికాలం కొనసాగలేకపోయింది. దాంతో 1991వ సంవత్సరం లో మళ్ళీ ఎన్నికలు రావడం జరిగింది. ఆ ఎన్నికల్లో రాజీవ్ గాంధీకి అనుకూల సూచనలు కనపడ్డాయి. 1991వ సంవత్సరం మే21వ తేదీన తమిళనాడులో 'శ్రీ పెరంబుదూర్' కు ఎన్నికల ప్రచార నిమిత్తం వచ్చిన రాజీవ్‌గాంధీ సభావేదికవైపుగా వెళుతుండగా ఎల్.టి.టి.ఈ 'ఆత్మాహుతిదళం' కు చెందిన మహిళ ఆయనకు దండ వేయడానికి వచ్చి బెల్టుబాంబు పేల్చడంతో రాజీవ్‌గాంధీ అక్కడికక్కడే మరణించారు. రాజీవ్ శరీరం ముక్కలు ముక్కలు కాగా, ఆయన కాలిబూటును బట్టి ఆయన శరీరాన్ని గుర్తించవలసి వచ్చింది. అంతకు ముందు రాజీవ్ ప్రధానిగావున్న సమయంలో శ్రీలంకలో ఎల్.టి.టి.ఈ తో పోరాటానికి భారతసైన్యాన్ని పంపడానికి వ్యతిరేకంగా ఎల్.టి.టి.ఈ టైగర్లు యీ విధంగా రాజీవ్‌గాంధీని హత్యచేసి పగ తీర్చుకున్నారు. రాజివ్ మరణాంతరం భారతదేశ విశిష్ట పురస్కారమైన భారతరత్న అవార్డును కేంద్ర ప్రభుత్వం 1991లో ప్రకటించింది. ఈయన వర్ధంతి రోజైన మే 21నాడు జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుంది.

## జవాబుదారీతనానికి పారదర్శకతకు
# పాతరేసిన ఎన్నికల కమిషన్

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 19:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి సంరక్ష కుడిగా ఒకప్పుడు ప్రపంచ వ్యాప్తంగా కీర్తించబడిన భారత ఎన్నికల కమిషన్, ఇప్పుడు తప్పుడు కార ణాల, నిర్ణయాల వల్ల తీవ్ర అపనమ్మకాన్ని గురవుతోంది. బీహార్‌లో "ఓట్ల దొంగతనం" ఆరోపణలను పరిష్కరించడానికి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఎన్నికల కమిషన్ సందేహాలు నివృత్తి కంటే ఎక్కువ సందేహాలను లేవనెత్తి సమస్యను మరింత జటిలం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాహుల్ గాంధీ ఆరోపణలను "నిరాధారమైనది" అని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ, అఫిడవిట్ లేదా జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల నిర్వహణ, కమిషన్ నిష్పాక్షికత గురించి అనేక ప్రాథమిక ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వలేదు. ఎన్నో ప్రశ్నలకు దాటవేసే ధోరణి కొనసాగింది, నీళ్లు నమలడం తప్ప చేయగలిగింది ఏమి లేదని సమాధానాలు దాటవేశారు. ఓటర్లకు భరోసా ఇవ్వడానికి బదులుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రతిస్పందనలు లేకపోవడం - చట్టబద్ధమైన ఆందోళనలతో పాల్గొనడానికి ఇష్టపడని సంస్థ ఇమేజ్‌ను చిత్రించాయి.

వరద ప్రభావిత బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎందుకు అమలుపరు స్తున్నారు? ఎన్నికల సంవత్సరంలో అటువంటి సవరణకు వ్యతిరేకంగా కమిషన్ స్వంత మార్గదర్శకాల ఉల్లంఘన, ఎన్నికల జాబితా ఫార్మాట్ల లో ఆకస్మిక మార్పులు, ప్రతిపక్ష నాయకులు గతంలో సమర్పించిన అఫిడవిట్‌లపై చర్య తీసుకోకపోవడం వంటి ప్రశ్నలు అన్నీ పక్కదారి పట్టాయి. ఓటరు ఐడి నకిలీ, బయోమెట్రిక్ భద్రతా ప్రమాణాలు లేకపోవడం మెషిన్-రీడబుల్ రోల్స్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలపై జర్నలిస్టులు కమిషన్‌ను ఒత్తిడి చేశారు. ఎన్నికల విశ్వసనీయతకు కేంద్రంగా ఉన్న పదకొండు ప్రశ్నలకు ఎటువంటి సమాధానాలు రాలేదు. కమిషన్ పక్షపాత పద్ధతిలో వ్యవహరిస్తుందనే ప్రతిపక్ష ఆరోపణను తేలికగా తోసిపుచ్చలేము. ఒక రాజకీయ నాయకుడి నుంచి అఫిడవిట్లు డిమాండ్ చేస్తూ, ఇతరులు ఇలాంటి వాదనలు విస్మరిస్తే, ఎన్నికల కమిషన్ దాని పరిశీలనలో ఎంపిక చేసుకుంటుందనే భావనను బలపరుస్తుంది. సాక్ష్యం నిరూపించబడక ముందే - పక్షపాత ధోరణి, అవగాహన కూడా పూర్తిగా ప్రజా విశ్వాసం పై ఆధారపడే సంస్థకు క్షీణిస్తుంది. ఎన్నికల కమిషన్ అధికారం రాజ్యాంగ బద్ధమైనది మాత్రమే కాదు, నైతికమైనది కూడా అని గుర్తుంచుకోవడం ముఖ్యం.

దాని విశ్వసనీయత రాజకీయ పోరాటాలకు అతీతంగా ఉండి, ప్రభుత్వాలు లేదా పార్టీలకు కాదు, ఓటరుకు సేవ చేయగల సామర్థ్యం పై ఆధారపడి ఉంటుంది. ఎన్నికల సమగ్రతకు కేంద్రంగా ఉన్న ప్రశ్నలను తప్పించు కోవడం ద్వారా, భారత ప్రజాస్వా మ్యన్ని అపహాస్యం చేసినట్లు. పారదర్శకతను కోరుతున్న సమయంలో కమిషన్ ఆ విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంది. బీహార్ వివాదం ఒక వివిక్త సంఘటన కాదు. జాతీయ ఎన్నికలు సమీపిస్తున్నందున, ఓటర్ల జాబితాలను నిర్వహించడం, విధానపరమైన న్యాయాన్ని నిర్ధారించడం విశ్వసనీయ ఆరోపణలకు ప్రతిస్పందించడంలో కమిషన్ ప్రవర్తన ఒక రాష్ట్ర ఎన్నికల ఫలితాన్ని మాత్రమే కాకుండా, ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధతను కూడా నిర్ణయిస్తుంది. 2004లో, రాబోయే ఎన్నికల కారణంగా ఎన్నికల కమిషన్ అరుణాచల్ ప్రదేశ్ మహారాష్ట్రలలో ఇలాంటి సవరణ చర్యలను వాయిదా వేసింది. ప్రజాస్వామ్యం హామీల ద్వారా మాత్రమే నిలవదుబీ ఇది నిష్కాపట్యత జవాబుదారీతనంపై వృద్ధి చెందుతుంది. కీలక అంశాలపై కమిషన్ మౌనం వహించడం తటస్థత కాదని - అది తన బాధ్యతను వదులుకోవడమేనని గుర్తుంచుకోవడం మంచిది. విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, అది వాస్తవాలను రికార్డులో ఉంచాలి, దాని ప్రక్రియలను పూర్తిగా వివరంగా వివరించాలి రాజకీయ నాయకులు, పౌర ప్రజా సంఘాల నుంచి అది ఆశించే పరిశీలనకు లోబడి ఉండాలి.

ఎన్నికల కమిషన్ ఖ్యాతి కంటే ప్రమాదం అంచున ఉందని ప్రజలు భావిస్తే కష్టం. ఎన్ని కలను భారత ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలుగా చేసే నమ్మకం సమతుల్యత మధ్య వేలాడుతోంది. బీహార్ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో, కమిషన్ ఒక ప్రెస్ మీటింగ్ పెట్టి తమ వైఫల్యాలను బహిర్గతపరుచుకుంది. విమర్శకులతో బహిరంగంగా పాల్గొనాలి, రాజకీయ పార్టీలు కోరినట్లే తనను తాను పరిశీలించుకోవాలి. ఏదైనా తక్కువైతే, "స్వేచ్ఛాయుతమైన మరియు న్యాయమైన ఎన్నికలు" అనే పదబంధం ఒక వాస్తవికత గా కాకుండా ఒక ఆచార మంత్రంగా మారే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో, సూర్యకాంతి ఉత్తమ క్రిమిసంహారక మందు. ఎన్నికల కమిషన్ నీడ వెనుక దాక్కున్న అందరూ ఓడిపోతారనీ డా. ముచ్చుకోట సురేష్ బాబు తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు

## ఘనంగా 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**విజయవాడ - సూర్య వాస్తవం, ఆగస్టు 19:** ఒక ఛాయాచిత్రం వేయి భావాల నేత్రమని.. వేల కథనాలకు సరిసాటి అని.. చరిత్రలో ఎన్నో చిత్రాలు ఇప్పటికీ మన మనసుల్లో పదిలంగా ఒదిగాయని, ఫొటో జర్నలిస్టులు భావితరాలకు ఫొటోల రూపంలో విలువైన విజ్ఞానాన్ని అందించే కార్యసాధకులని ఆంధ్రప్రదేశ్ సీఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అన్నారు. 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ (ఏపీపీజేఏ) ఆధ్వర్యంలో నగరంలోని గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు సందర్భంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలకు మొత్తం తొమ్మిది రాష్ట్రాల నుంచి స్పాట్ న్యూస్, జనరల్ కేటగిరీలో 552 ఫొటోలు రాగా 50 ఫొటోలకు బహుమతులు లభించాయి. వీటికి సంబంధించిన ఫొటోగ్రాఫర్లకు సీఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జర్నలిస్టు, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ల ప్రతినిధులతో కలిసి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ తన బాల్యం నుంచి ఫొటోగ్రఫీ అంటే ప్రత్యేక ఆసక్తి అని.. ఫొటోగ్రఫీ పోటీల్లో గెలు పొందిన ప్రతి చిత్రం స్ఫూర్తిదాయకం, సందేశాత్మకమని పేర్కొన్నారు. ప్రతి సందర్భంలోనూ ఓ ప్రత్యేక కోణం తారస పడు తుందని.. ఆ సందర్భాన్ని పదునైన ఆలోచనలతో పట్టుకొని దృశ్య రూపం ఇవ్వడంలోనే ఫొటోగ్రాఫర్ల చతురత ఉంటుందన్నారు. ది టెర్రర్ ఆఫ్ ది వార్, ది వల్చర్ అండ్ ది లిటిల్ గర్ల్ వంటి ఫొటోలు సృష్టించిన సంచలనాన్ని వివరించారు. ఫొటోగ్రఫీ పోటీల్లో విజేత లుగా నిలిచిన వారికి అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్త ఫొటోగ్రాఫర్ల ఐక్యతను, వారి ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా జరుపు కుంటున్న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం దోహదం చేస్తోందని సురేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వానికి, ప్రజ లకు వారధిగా ఫొటో జర్నలిస్టులు: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ.. లోటుపాట్లు ఉంటే సరిదిద్దడంలోనూ ఫొటో జర్నలిస్టులు ప్రభు త్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్నారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.ఈ క్రమంలో ఫొటో జర్నలిస్టులు కూడా కీలక భాగస్వాములే అని పేర్కొన్నారు. ఎంతో ఓపికతో నిబద్ధతతో ఫొటో గ్రాఫర్లు తీసిన చిత్రాలు మనిషి మెద ళ్లను కదిలిస్తాయని, అంతటి మహత్తర శక్తి చిత్రానికి ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతిఒక్కరికీ






అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రపంచ ఫొటో గ్రఫీ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహ రించిన సీనియర్ జర్నలిస్టు పీవీ కృష్ణారావు, సీనియర్ ఫొటో జర్నలిస్టులు సీహెచ్‌వీ మస్తాన్, సీహెచ్ నారాయణరావు, ఐ అండ్ పీఆర్ శాఖలో సీని యర్ ఫొటోగ్రాఫర్‌గా సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న వీవీ ప్రసాద్‌లను సత్కరించారు.

# నేడు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

**- అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలి**
**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** ఈనెల 20వతేదీన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ప్రారంభించడం జరుగుతుందని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్న అనంతపురం నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్‌లో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 20వతేదీన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించడం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభి స్తారన్నారు. అనంతపురం జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ నుంచి ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అది.కారులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, తదితరులు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ లో రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం కోసం అన్ని రకాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ఆవిష్కరణ, స్టార్టప్‌లు, నైపుణ్య అభివృద్ధి, ఉపాధి సృష్టిని ప్రోత్సహించే లక్ష్యంతో, సిలికాన్ వ్యాలీ తరహా



ఇకోసిస్టమ్‌ను సృష్టించడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏర్పాటు చేస్తున్నా రన్నారు. రాష్ట్రంలో రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి నగరాలతో పాటు అనంతపురం ఒక కీలక కేంద్రంగా ఎంపికైందన్నారు. ఈ సెంటర్‌లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదే శించారు. సెంటర్ వద్ద నాటిన మొక్కలను సంర క్షిం చాలని హార్టికల్చర్ డిడికి సూచించారు. సెంటర్‌లో ఇంటర్నెట్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఎన్ఐసి డిఐఓ రవిశంకర్, జిల్లా పరిశ్రమల శాఖ ఏడి రాజశేఖర్ రెడ్డి, నగర పాలక సంస్థ ఎస్ఈ చంద్రశేఖర్, ఆర్.అండ్.బి జెఈ బాల కాటమయ్య, ఎస్కే యూనివర్సిటీ అధికారి చంద్రమౌళి పాల్గొన్నారు.

## ఓటు చోరీపై కాంగ్రెస్ కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ








**హిందూపురం – సూర్య వాస్తవం, ఆగస్టు 19:** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేష్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై క్రొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వ హించారు. ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించిన ఈ నిరసన ర్యాలీకి ముఖ్య అతిథిగా శ్రీ సత్య సాయి జిల్లా డిసిసి అధ్యక్షులు ఎం.హెచ్ ఇనాయ తుల్లా హాజర య్యారు. ఆయన ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరము చేపట్టిన నిరసన ర్యాలీని కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీకి జై, రాహూల్ గాంధీ ఓట్ అధికార్ యాత్ర విజయవంతం కావాలని, ఓట్ చోర్ – గద్దె చోడ్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భాజాపా, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై ఎన్నికల్లో భారీ నేరపూరిత మోసానికి పాల్పడ్డారని అన్నారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ సంచలన ఆరోపణలలో నిజం వుందని అన్నారు. ఓట్ల చోరీ విధానం దేశ వ్యాప్తంగా లోక్సభ, శాసనసభ ఎన్నికల సందర్భంగా అనేక నియోజకవర్గాల్లో కొనసాగిందని విమర్శించారు.దీనికి 'మహాదేవపుర ఓటర్ల జాబితాయే నిదర్శనమని గుర్తు చేశారు. ఈ నియోజకవర్గంలోనే లక్షకు పైగా ఓట్లు చోరీకి గురైనట్లు తేలిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం కోఆర్డినేటర్ ఎం.ఇ. కిపాయతుల్లా తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులను

# గ్రామ పంచాయతీలకు బదిలీ చేయాలి

**- ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి**
**- పెంచిన రసాయన ఎరువుల ధరలు తగ్గించాలి**
**- యూరియా కొరత లేకుండా చూడాలి**
**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి – సూర్య వాస్తవం, ఆగస్టు 19:** కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే గ్రామపంచాయతీలకు బదిలీ చేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2024 సెప్టెంబర్ లో 989 కోట్ల రూపాయలు, 2024 డిసెంబర్లో రూ.1121, మొత్తం 2109 కోట్ల రూపాయలను 15వ ఆర్థిక సంఘం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు విడుదల చేసింది. ఈ నిధులు అందిన 10 రోజుల లోపల రాష్ట్ర ప్రభుత్వము ఆ నిధులను గ్రామపంచాయతీలకు బదిలీ చేయాలి .కానీ 10 నెలలు అయినప్పటికీ ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు బదిలీ చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వమే ఆ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్ళించింది . పర్యవసానంగా గ్రామపంచాయతీలు నిధులు లేక నీరసించి పోయాయి. పారిశుధ్య సిబ్బందికి ,వాటర్ స్కీముల సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు నిధులు లేక ఇబ్బంది పడుతున్నాయి. పర్యావసానంగా గ్రామ పంచాయతీల లో పారిశుధ్యం పడకేసింది. గతంలో వైకాపా ప్రభుత్వం ఇదే పని చేస్తే ఆనాడు టిడిపి కూటమి పార్టీలు విమర్శించడం జరిగింది. కానీ అదే పని ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం చేస్తా ఉంది .ఇది ఎలా ఉందంటే కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్న సామెతను గుర్తు చేస్తా ఉంది . ఇంక ఏమాత్రం ఆలస్యం చేయకుండా 15 ఆర్థిక సంఘం నిధులు 2109 కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీలకు బదిలీ చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్**

ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద 4200 కోట్ల రూపాయలు, స్కాలర్షిప్ల కింద 2200 కోట్ల రూపాయలు ,వెరసి 6400 కోట్ల రూపాయలు పెండింగ్ లో ఉన్నాయి .పర్యవసానంగా కళాశాల యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేక ,కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నాయి. వారేమో విద్యార్థుల మీద ఒత్తిడి తెస్తున్నారు .సర్టిఫికెట్ ఇవ్వకుండా .విద్యార్థులు సర్టిఫికెట్ లేని కారణంగా పై చదువులకు పోలేకపోతున్నారు, ఉద్యోగ అన్వేషణ చేయలేకపోతున్నారు .కాబట్టి ఇంక ఏమాత్రం ఆలస్యం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం 6400 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

**పెంచిన ఎరువుల ధరలు, యూరియా కొరత**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇటీవల రసాయనఎరువుల ధరలు అమాంతంగా పెంచడం జరిగింది. ఒకవైపు వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అవస్థ పడతా ఉంటే గోరుచుట్టు మీద రోకటి పోటు లా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎరువుల ధరలు అమాంతంగా పెంచడం జరిగింది. గతంలో 50 కేజీల పొటాష్ బస్తా 1530 రూపాయలు ఉంటే దాన్ని 1800 రూపాయలకు పెంచింది .అంటే ఒక బస్తా మీద 265 రూపాయలు పెరిగింది. అదేవిధంగా 10౹26౹26 కాంప్లెక్స్ ఎరువు ధర 50 కేజీల బస్తా గతంలో 1470 రూపాయలు ఉంటే ఇప్పుడు 18 00 రూపాయలు అయింది .అంటే 330 పెరిగింది. ప్రతి కాంప్లెక్స్ ఎరువు ధర 50 కేజీల బస్తా 50 నుంచి 330 వరకు పెరిగింది .ఇది కాక గోరుచుట్టు మీద రోకటి పోటు లా యూరియా కొరత. ప్రధానంగా రైతులు డిమాండ్ చేస్తా ఉండేది యూరియా. కానీ అది కొరతగావఉంది . కేంద్రప్రభుత్వం ఖరీఫ్ సీజన్కు గాను ఆంధ్రప్రదేశ్కు కేటాయించిన యూరియా కోటా ఒక్క లక్ష 30 వేల మెట్రిక్ టన్నులు. కానీ ఇంతవరకు 49 వేల 485 మెట్రిక్ టన్నులు మాత్రమే రావడం జరిగింది. ఇంకా 80,519 మెట్రిక్ టన్నులు రావాలి. అందువలన యూరియా కొరత .కాబట్టి కేంద్ర ప్రభుత్వము పెంచిన రసాయన ఎరువు ధరలు వెంటనే ఉపసంహరించు కోవాలి. యూరియా కొరత లేకుండా చూడాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

## అమరావతిపై విషం చిమ్మడం ఇకనైనా ఆపు జగన్ రెడ్డి

**- మూడు రాజధానులు అంటూ అమరావతి అభివృద్ధిని అడ్డుకున్నావు**
**- ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే ఇలాంటి ఆరోపణలు**
**- జగన్, వైసీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ గ్రంథాలయ ఛైర్మన్ జిరాయితీ గౌస్ మోద్దిన్**



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, ఆగస్టు 19:** అమరావతి అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, ఆ పార్టీ నాయకులు విషం చిమ్ముతున్నారని మాజీ గ్రంథాలయ ఛైర్మన్ జిరాయితీ గౌస్ మోద్దిన్ ఆగ్ర హం వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో గౌస్ మోద్దిన్ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ మోద్దిన్ మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకొని, రైతులను దగా చేసి ఇప్పుడు వైసీపీ నాయకులు ఆ పార్టీ అధినేత జగన్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని ముక్కలు చేయాలని చూసారన్నారు. 2024 ఎన్నికలలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి అమ రావతిని ప్రపంచ స్థాయిలో నిలపాలని దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అమరావతి ముంపు ప్రాంతాల్లో ఉందని ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి చేతకాని మీరు చంద్రబాబు నాయుడు పాలనపై మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవ చేశారు. మీ గాలి మాటలు వినడానికి ప్రజల సిద్ధంగా లేరని, రానున్న రోజుల్లో మీ పార్టీకి 11 సీట్లు కూడా రావని గౌస్ మోద్దిన్ తెలిపారు.

# కుక్కల సమస్యకు పరిష్కారం చూపండి

**- నగర మేయర్ మహమ్మద్ వసీం**

**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం, ఆగస్టు 19:** నగరంలో ఉన్న కుక్కల సమస్యకు పరిష్కారం చూపాలని నగర మేయర్ మహమ్మద్ వసీం సిడిఎంఏ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. నగర పర్యటనకు విచ్చేసిన సిడిఎంఏ సంపత్‌ను నగర మేయర్ మహమ్మద్ వసీం మర్యాదపూర్వకంగా కలిసిశారు.

ఈ సందర్భంగా నగరంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందువల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో డంపింగ్ యార్డ్‌లో ప్రత్యేకంగా కుక్కలను అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ కు తరలించి నియంత్రణ చర్యలు చేపట్టామని కొన్ని కారణాల వల్ల ప్రస్తుతం ఆ పక్రియ ఆగిపోవడంతో నగరంలో కుక్కల బెడద అధికమవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో సభ దృష్టికి తీసుకువచ్చారని, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు



చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని మేయర్ వసీం కోరారు. మేయర్ వెంట కార్పొరేటర్లు శ్రీనివాసులు, ఇషాక్, కమల్ భూషణ్, వైసీపీ నాయకులు చింతకుంట మధు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

**రాప్తాడు– సూర్య వాస్తవం, ఆగస్టు 19:**గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, అలాగే వైద్య పరీక్షలు కూడా చేయించుకోవాలని డాక్టర్ శివకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం రాప్తాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంను నిర్వహించారు. సుమారు 50 మంది గర్భవతులకు బి.పి షుగర్ హెచ్.బి యూరిన్ పరీక్షలు నిర్వహించారు.ప్రమాదకర గర్భవతులకు ప్రత్యేక పరీక్షలు చేశారు. గర్భవతులు తప్పనిసరిగా నెలసరి పరీక్షలు పౌష్టిక ఆహారం ఐరన్ మాత్రలు తీసుకోవాలని తెలియజేశారు. గర్భవతులకు వైద్య సిబ్బందికి పెట్లు చంద్రకాంత్ పెట్లు కళ్యాణ్ కలిసి పౌష్టిక ఆహార భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అరుణ నరసింహులు ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు ఫార్మసీ ఆఫీసర్ మూర్తి ఎంఎల్ హెచ్‌పిలు ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### - సీపీఐ అనంతపురం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున




**రాయదుర్గం – సూర్య వాస్తవం, ఆగస్టు 19:** సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాయదుర్గం పట్టణం సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ అనంతపురం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించింది. పొత్తిళ్లలోనే పోరాటాన్ని పుణికిపుచ్చుకొని అనేక కుట్ర కేసులును, నిర్బంధాలను, నిషేధాలను ఎదుర్కొని భారత స్వాతంత్ర సంగ్రా యంలో అగ్రభాగాన నిలిచింది. స్వాతంత్ర్యానంతరం రాజ భరణాలు రద్దు బ్యాంకుల జాతీయకరణ భూసంస్కరణల చట్టం అమలు కోసం పోరాడి సాధించింది. ప్రభుత్వ రంగ పరిశ్రమల ఏర్పాటుకు, పరిరక్షణకు అనేక వీరోచిత పోరాటాలను నిర్వహించింది. దేశ సార్వభౌమాధికారం, మత సామరస్యత, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా కంటక విధానాలను అమలుపరుస్తూ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి నల్లధనం వెలికితీత, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగా కల్పన వంటి హామీల మంటగలిసింది. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా నినాదాలు ఆర్భాటాలే తప్ప ఒక మ్యానుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ కూడా ఏర్పాటు చేయలేకపోయారు. కేవలం ఒక మోడీ హయాంలోనే రూ. 100 లక్షల కోట్ల అప్పులు తెచ్చి దేశాన్ని అప్పుల భారత్గా మార్చారు బేటీ బచావో బేటి పడావో వంటి మాటలు శుష్క వాగ్దానాలుగా మిగిలిపోయాయి. మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా ముస్లిం మైనారి టీలను టార్గెట్ చేస్తూ మత విద్వేషాలను ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధిపొందేందకు బిజెపి చేస్తున్న కుట్రలను వ్యతిరేకిస్తూ బిజెపి పాటవో- భారత్ బచవో లాంటి స్ఫూర్తి దాయకమైన ఉద్యామాలను చేపట్టింది సిపిఐ, వక బోర్డు సవరణ చట్టం వ్యతిరేకిస్తు మతపర మైనటువంటి ఆస్తుల విషయంలో ప్రభుత్వాలు అనవసరమైన జోక్యం వ్యతిరేకిస్తూ అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించింది సిపిఐ.

100 సంవత్సరాలు పూర్తి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న పనిగంటలు హక్కులు హరిస్తున్నది. ప్రభుత్వ రంగం సంస్థలను తెగ నమ్ముతున్నది. 32 మంది ప్రాణత్యాగాలతో ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని తెగనమ్మడానికి పూనుకున్నది. పెట్రోల్, డీజిల్ గ్యాస్ నిత్య వసర వస్తువుల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచింది. రైల్వే, ఓడరేవులు, ఎయిర్పోర్టులు, బ్యాంకులు, ఎల్.ఐ.సి, బియస్ఎన్ఎల్, తపాల, విద్యుత్, గ్యాస్, నిక్షేపాలు, గనులు, జాతీయ రహదారులను ప్రైవేటీకరించేందుకు సిద్ధమైనది. దేశ సంపదను కట్టబెడుతూ ఆధాని, అంబాని వంటి కార్పోరేట్ శక్తులకు మోడీ, అమిత్షాలు ఊగిడం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశకు ప్రత్యేక హెూదా రాయలసీమ ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు, కడప ఉక్కు ఫ్యాక్టరీ పోలవరం జాతీయ ప్రాజెక్ట్, విశాక రైల్వే జోన్ ప్రకటించి చేతులు దులుపుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేస్తుంది సిపిఐ. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో 15 వేల కోట్ల రూపాయలుప్రజలపై భారం మోపుతున్నదని తక్షణమే ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరుతున్నాము. రాష్ట్రంలో మౌలిక సదుపాయలైన రోడ్లు, కాలువలు, విధీలైట్లు, త్రాగు నీరు వసతుల కల్పించాడంలో తీవ్రమైన నిర్లక్ష్యం జరుగుతున్నది. విద్యార్థులకు పెండింగో ఉన్న ఫీజ్ రీయింబర్స్మెంట్ వసతి దీవెన బకాయిలు ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయలాని, యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలు డిమాండ్ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశలు లేక పక్క రాష్ట్రలకు వలసలు వెలుతున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉన్నది.

ప్రతిసంవత్సరం జాబ్ కేలండర్ ను విడుదల చేస్తామన్న హామీని అమలు చేయాలి. ఉపాధ్యాయ వర్గాలకు ఉద్యోగ భద్రత కరువైనది సిపిఎస్ రద్దు పిఆర్సి అమలు హామీలకు మంగళం పాడింది. తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న పాలకులకు చెవికెక్కడం లేదు. కమ్యునిస్టులు పేదలు కోసం పోరాడి సాధించుకున్న ఉపాదిహామీ పథకాన్ని ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ ఉఫాధీ హామీ కూలీలకు అన్యాయం చేస్తున్నది. అందుకోసం ఉపాదీహామీ కూలి పనిదినాలు 200 రోజులకు పెంచాలని, రోజుకూలీ రూ.700 పెంచాలని డిమాండ్ చేస్తున్నా మని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ఆగస్టు 20 నుండి 25వరకు తేదీలలో ఒంగోలు నగరంలో సిపిఐ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయి. అన్ని చెప్పడానికి సంతోషం వ్యక్తం చేస్తున్నాం పెద్ద ఎత్తున పాల్గొన్ని ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కావలి కోట్రేష్, ఏపీ రైతుసంఘం తాలుక కార్యదర్శి తిప్పేస్వామి ,సిపిఐ నాయకులు నాగయ్య, తేజ, సురేష్, వంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట నమోదు చేయించుకోండి



**రాప్తాడు – సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** రైతులు తప్పనిసరిగా పంట ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ చైతన్య తెలియజేశారు. రాప్తాడు మండల పరిధిలోని గొందిరెడ్డిపల్లి బొమ్మేపర్తి రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతుల పొలాల్లో వేరుశనగ కంది జొన్న తదితర పంటలను పరిశీలించారు అనంతరం పొలంలోనే రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. అన్నదాత సుఖీభవ ఇంకా డబ్బులు పడిన వాళ్ళు రైతు సేవ కేంద్రాల్లో ఈనెల 20వ తేదీలోపు అర్జీలు ఇవ్వాలని తెలిపారు. కౌలు చేసే రైతులు కౌలు కార్డులు చేయించుకోవాలి అని అన్నారు. రైతులకు పంటలకు సంబంధించిన సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రంజిత సుజిత రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అడుగడుగునా ప్రభుత్వ అండ

### - కనేకల్లు రైతులకు కాలవ శ్రీనివాసులు హామీ








**రాయదుర్గం – సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** ప్రజల ఆశీర్వాదం, దీవెనలతో ఆంధ్రప్రదేశ్ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతా మని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ధీమా వ్యక్తపరిచారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్నదాతకు అడు గడుగునా అండగా నిలుస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి 20వేల ఆర్థిక సహాయం ప్రకటించిన ప్రభుత్వం మొదటి విడతగా రూ. ఏడు వేలు రైతుల ఖాతాలకు ఇటీవల జమ చేసిన విషయం విధితమే. కనేకల్లు మండల కేంద్రంలో రైతులు ప్రభు త్వానికి కృతజ్ఞతా పూర్వకంగా మంగళవారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అధికారంలోకి రాగానే పింఛన్ రూ.4000 చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా ఏడాదికి ప్రతి కుటుంబానికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పేరుతో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.13వేలు, అన్నదాత సుఖీభవ ద్వారా అర్హులైన రైతులందరికీ రూ.20వేలు చొప్పున ఆర్థిక సాయం అందించడం జరుగు తుందన్నారు. తాజాగా ఆగస్టు 15 నుంచి మహిళలకు, బాలికలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యాన్ని అమలు చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్న పేదలకు ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేదరికంలేని సమాజాన్ని చూడాలన్న సంకల్పంతో చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ మంది ఆధారపడ్డ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చాలని, రైతులకు పెట్టుబడి రాయితీ ద్వారా సాయం అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అమోఘమ న్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.3174 కోట్లు రైతులకు ఆర్థిక చేయూత అందించామన్నారు. అందులో రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని 42,533 మంది రైతులకు రూ.29.77 కోట్లు సాయం అందిందన్నారు. కనేకల్లు మండలంలో ఎక్కువమంది రైతులు వ్యవసాయంపై ఆధారపడ్డారన్నారు. ఈ మండలంలోనే 9767 మంది రైతులకు రూ.6.84 కోట్లు సాయం అందిం చడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు లందరికీ సమన్యాయం చేసిందన్నారు. సాయం అందిం చటంలో కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయ భేదాలు విభేదాలు వేటిని చూడలేదన్నారు. రైతులు బాగుండాలి, వ్యవసాయం లాభాల బాటలో పయనించా లన్న లక్ష్యంతోనే ఈ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సూపర్ సిక్స్ కింద ఇచ్చిన హామీల్లో ఇప్పటికే ఐదింటిని పూర్తిగా అమలు చేయడం జరిగిందని వివరించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను రాష్ట్రానికి ఆహ్వానించి వారి ద్వారా పరిశ్రమల ఏర్పాటు చేయించడానికి ప్రభుత్వం గట్టిగా శ్రమిస్తోందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యం కార్యరూపం దాల్చబోతుంద న్నారు. అలాగే 18ఏళ్ల పైపడ్డ మహిళలకు నెలకు రూ.1500 ఇచ్చే హామీ విధివిధానాల రూపకల్పనకు ప్రభుత్వం ప్రయత్ని స్తోందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింప చేయడానికి ముఖ్యమంత్రి తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ప్రజ లందరికీ మంచి చేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా ఉంటూ ఆశీర్వదించాలని కాలవ విన్నవించారు.

### రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు

# శ్రీశక్తి పథకాన్ని అమలు చేయండి

### - ఏపీఎస్ ఆర్టీసీ ఎండి ద్వారక తిరుమలరావుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనావాసులు విజ్ఞప్తి



**రాయదుర్గం– సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులో రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతివ్వాలని ఏపీఎస్ ఆర్టిసి ఎండి ద్వారకా తిరుమలరావుకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం విచ్చేసిన ఆయనను స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంగళవారం ఎమ్మెల్యే కలసి వివిధ అంశాలపై వినతి పత్రాలు సమర్పించారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాలతో సరిహద్దు ఉన్న ప్రాంతాల్లో రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోందని వివరించారు. వెనుక పడ్డ రాయదుర్గం నియోజకవర్గంలో రాయదుర్గం నుండి కర్ణాటక సరిహద్దు ప్రాంతాలు చాలా దగ్గరలో ఉన్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాలకు అనేక పల్లె వెలుగు బస్సులు అంతరాష్ట్ర సర్వీసులుగా నడుస్తున్నాయన్నారు. శ్రీ శక్తి పథకం అంతరాష్ట్ర సర్వీసులకు వర్తించకపోవడం వల్ల మహిళలు ఉచితంగా ప్రయాణించలేక పోతున్నారని వివరించారు. రాయదుర్గం నుండి బళ్లారి కి వెళ్లే పల్లె వెలుగు బస్సులు ఆంధ్ర సరిహద్దు వరకు దాదాపు 48 కిలోమీటర్లు ప్రయాణం చేస్తాయని, ఆ తర్వాత కేవలం 11 కిలోమీటర్లు మాత్రమే కర్ణాటకలో ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి ప్రాంతాలలో నడిచే పల్లె వెలుగు అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల్లో రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు శ్రీ శక్తి పథకాన్ని అమలు చేయడం వల్ల మహిళలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

రాయదుర్గం నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని అనేక సరిహద్దు ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలే ఉన్నాయని వెల్లడించారు. ఇదివరకే ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో సరిహద్దు స్టేజ్ వరకు ఆ రాష్ట్రాల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్నారని తెలియజేశారు. ఈ విషయంపై ద్వారకా తిరుమలరావు సానుకూలంగా స్పందించారు. ఇదివరకే ముఖ్యమంత్రితో ఈ అంశంపై ప్రాథమికంగా చర్చించడం జరిగిందని ఆయన వివరి ంచారు. రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు అమలు చేయడం వల్ల ఆర్టీసీపై ఏ మేరకు అదనపు భారం పడుతుందో సమగ్ర వివరాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని ఎండి తెలియపరిచారు.

వెనుకబడ్డ ప్రాంతమైన రాయదుర్గం నుండి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే అనేక సర్వీసులను రద్దు చేశారని ఎండికి కాలవ వివరించారు. దానివల్ల విదా ్యర్థులు, మహిళలు, రైతులు ఎక్కువ ఇబ్బందులు పడు తున్నారని గుర్తు చేశారు. రాయదుర్గం నుండి తాళ్లకేర, గుడిసెలపల్లి, రంగసముద్రం, మేచ్చిరి, కెంచానపల్లి, గవి సిద్దేశ్వర, గోవిందవాడ, కూడ్లిగి, రంగచేడు, కలుగోడు, రాయంపల్లి, చెల్లికేర ప్రాంతాలకు నడిచే బస్సు సర్వీస్ లను యధావిధిగా పునరుద్ధరించాలని కోరారు. ముఖ్య మంత్రి చంద్రబాబు హామీ మేరకు మురడిబి నేమకల్లుకు తాను ప్రారంభించిన సర్వీసుకూడా రద్దు చేశారని, తిరిగి పునరుద్ధరించాలని విన్నవించారు. కళ్యాణదుర్గం నుండి కనేకల్ మీదుగా బళ్లారికి వెళ్లే రద్దయిన సర్వీసులను తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కనేకల్ మండలం నాగేపల్లికి ఓ సర్వీసు ప్రారంభించాలని కోరారు. రాయదుర్గం నుండి దూర ప్రాంతాలైన మంత్రాలయం, దావనగేర, నంద్యాల, కడపలకు బస్సు సర్వీసులు ప్రారంభించాలని, అదేవిధంగా ధర్మస్థలం, నెల్లూరుకు సూపర్ లగ్జరీ బస్సులు నడపాలని కాలవ విజ్ఞప్తి చేశారు.

# కమ్యూనిస్టు పార్టీలతోనే ప్రజాస్వామ్యం సాధ్యం



**రాప్తాడు – సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** దేశంలోని నిరుపేదలు కార్మికులు రైతులు నిరుద్యోగులు విద్యార్థిని విద్యార్థులు మహిళల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం రాప్తాడు మండల కేంద్రంలో సిపిఐ పార్టీ రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈనెల 23 24 25న భారత కమ్యూనిస్టు పార్టీ 28వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మతోన్మాద అజెండాతో ముందు కుపోతోంది. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ప్రజా స్వామ్యా నికి పాతర వేస్తోందని మండిపడ్డారు. దొంగ ఓట్లు దొంగ నోట్ల రాజ్యం ప్రస్తుతం దేశంలో నడుస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశ ప్రజలకు ఆయుధంగా ఇచ్చిన ఓటు హక్కును రద్దు చేస్తున్నారన్నారు. దొంగ ఓట్ల వ్యవహారంపై దేశమంతా చర్చ జరుగుతుంటే ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు పవన్ కళ్యాణ్ జగన్ దీనిపై స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా విస్తృతంగా చర్చ జరుగుతోంది. కానీ చర్చ లేని రాష్ట్రంగా ఏపీ నిలిచిందని ఎద్దేవాచేశారు. దొంగ ఓట్లపై స్పందించకుండా పులివెందులలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడు తున్నారని విమ ర్శించారు. జాతీయ ఎన్నికల కమీషన్ కూడా బీజేపీతో లాలూచీ పడింది. సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంటే గాని ఓటర్ లిస్టు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారతదేశంలో ప్రజాస్వామ్యం నిలబడాలంటే అర్హులకు ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు. ప్రతివక్షంలో ఉండగా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారని అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అన్నారు. ఈ పదకొండేళ్ల పాలనలో మోదీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. రైతాంగాన్ని గాలికి వదిలేశారు. ధరలు నియంత్రించలేదు. పేదరికాన్ని పోగొట్టలేదు. ఉద్యోగ కల్పన చేయలేదు. నల్లధనం వెనక్కి తీసుకురాలేదని చెప్పారు. మనదేశంలో ప్రజలకు న్యాయం జరగాలంటే ఎర్రజెండా పార్టీలతోనే సాధ్యమవుతుందని తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గం నుండి ప్రజలు పెద్ద ఎత్తున మహాసభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు రామకృష్ణ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రమేష్ రూరల్ మండల కార్యదర్శి నరేష్ రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర ఆత్మకూరు మండల కార్యదర్శి శివ రూరల్ మండల సహాయకార్యదర్శి దుర్గ ప్రసాద్ రాప్తాడు మండల సహాయ కార్యదర్శి చలపతి ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ధనంజయ రాము శాఖ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు మృతి



**మదనపల్లె - సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. ములకలచెరువు ఎస్ఐ నరసింహుడు కథనం మేరకు..మండలంలోని చౌడసముద్రం గ్రామం, చెట్లవారిపల్లికి చెందిన రైతు జి.వంశీకృష్ణరెడ్డి (30) కుటుంబ సమస్యలతో ఈ నెల 10న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు బాధితున్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి, అక్కడ నుంచి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో వంశీకృష్ణారెడ్డి మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మదనపల్లె ట్రాఫిక్ సీఐగా గురునాథ్



**మదనపల్లె - సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** మదనపల్లె ట్రాఫిక్ సిఐగా గురునాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ట్రాఫిక్ సిఐగా పనిచేస్తున్న మోహన్ కుమార్ రాయచోటికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో సీఐ గురునాథ్ మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను వాహన చోదకులు విధిగా పాటించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా సహకరించాలని తెలిపారు. నిభందనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపు నిర్వాహకులు రోడ్డును ఆక్రమించకుండా తమ షాపు పరిధిలోని వస్తువులను పెట్టుకోవాలన్నారు. అదే విధంగా దుకాణాల వద్ద కొంత పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## మట్టి వినాయకుల పంపిణీ



**అనంతపురం - సూర్య వాస్తవం, ఆగస్టు 19:** అనంతపురం పట్టణంలోని స్థానిక శ్రీనివాస్ నగర్‌లో గల శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో ఆదివారం నాడు ఉదయం 10:30 గంటలకు వినాయక చవితి పండుగ పురస్కరించుకొని దాతల సహాయ సహకారాలతో శ్రీవారిపునర్ష్కరించుకొని ఆశీస్సులతో ఉచిత మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ... శ్రీవారి సేవకులచే ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ప్రతిష్టాత్మంగా జరుపబడుతుందనీ టోకెన్ల కొరకు మా శ్రీవారి సేవకులను సంప్రదించాలని ఆయన కోరారు.

## మలేరియాపై విద్యార్థులకు అవగాహన






**గాండ్లపెంట- సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మలేరియా పై విద్యార్థులకు డాక్టర్ మహేశ్వర్ మారుతి అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా దోమ ను లార్వాదశలోనే నిర్మూలించాలని అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మురికి నీరు అపరిశుభ్రత పరిసర ప్రాంతాలలో దోమలు నివసిస్తాయని అవి కుట్టడం వలన మలేరియా విష జ్వరాలు వస్తాయని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణంలో మలాథిన్ పౌడర్ పిచికారి చేయించారు. అదేవిధంగా ధనుర్వేద అరికట్టే అందుకు 37 మంది విద్యార్థినీ విద్యార్థులకు టీకాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఉపేంద్ర, నాగరత్న విజయ్, కుమారి ఆరోగ్య సిబ్బంది విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా 186వ ఫోటోగ్రఫీ దినోత్సవం




**నాయుడుపేట -సూర్య వాస్తవం, ఆగస్టు 19:** నాయుడుపేట పట్టణంలో మంగళవారం 186వ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.ధర్మయ్య, చిగురాకుల శివకుమార్, స్థానిక ఫోటో స్టూడియో యజమానులు, ఫోటోగ్రఫీ కార్మికుల ఆధ్వర్యంలో 186 ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గాంధీ మందిరం వద్ద నుండి ఫోటోగ్రాఫర్లు తమ ఐక్యతను చాటుతూ ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డి ఎస్ ఆర్ కళ్యాణమండపంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఫోటోగ్రాఫర్స్ డే సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్లను గుర్తు చేసుకుని వారికి సంతాపాన్ని తెలియజేశారు .అనంతరం జరిగిన కార్యక్రమంలో నాయుడుపేట లోని పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లకు శాలువా కప్పి పూల




మాలలు వేసి సన్మానించి సత్కరించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీనియర్ ఫోటోగ్రాఫర్లు వారి అనుభవాలను పంచుకుని నేటి తరం ఫోటోగ్రాఫర్లకు సూచనలు అందించారు.సీనియర్ ఫోటోగ్రాఫర్ గూడూరు కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లకు పక్కా ఇల్లును నిర్మించి ఫోటోగ్రాఫర్స్ కాలనీ ఇవ్వాలని ఆ దిశగా ప్రభుత్వం చొరవ తీసు కునేలా ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అడుగులు వేయాలని అందుకు తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు.స్థానిక ఎమ్మెల్యేని అధికారులను కలిసి వినతి పత్రం అందించి ఫోటోగ్రాఫర్లకు పక్క ఇల్లు సాధించేందుకు తన వంతుకృషి చేస్తానని, అందరూ ఫోటోగ్రాఫర్లు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాయల్ స్టూడియో చిగురాకుల శివ కుమార్ అధ్యక్షత ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ జీకే డిజిటల్స్ గూడూరు కిరణ్ కుమార్,శివ స్టూడియో రవి, స్టార్ స్టూడియో జి ఆర్ బాబు ,కుమార్ స్టూడియో రాహుల్,ఎస్ వి స్టూడియో గోపీనాథ్ రెడ్డి,సిరి ఫోటో స్టూడియో అనిల్, స్థానిక ఫోటో స్టూడియో యజమానులు,ఫోటో స్టూడియో కార్మికులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

**- సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్. రాధాకృష్ణ**




**పత్తికొండ టౌన్- సూర్య వాస్తవం, ఆగస్టు 19:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని పత్తికొండ పట్టణంలోని స్థానిక కుమ్మరి వీధిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి భవనం నందు సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర, అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్. రాధాకృష్ణ, సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ డివిజన్ అయినప్పటికీ లేబర్ ఆఫీస్ కేటాయిం చకపోవడం దురదృష్టకరమని వేలాదిమంది కార్మికులు ఉన్న డివిజన్ హెడ్ కోటర్ నందు లేబర్ ఆఫీస్ ను వెంటనే నియమించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించి వారి సంక్షేమం కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం వెంటనే పట్టణంలో గృహ నిర్మాణం కోసం రెండు సెంట్లు స్థలాన్ని కేటాయిం చాలన్నారు. అనంతరం సిపిఎం కార్యాలయం నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్ భవన నిర్మాణ కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డు పునరుద్ధరించి లేబర్ కార్యాలయాన్ని పత్తికొండలో కేటాయించి గృహ నిర్మాణం కోసం రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం స్థలం కావాలనుకున్నవారు ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని లేబర్ కార్యాలయం సంక్షేమ బోర్డు సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## ఇద్దరు చైన్ స్నాచర్లు అరెస్ట్



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 19:** అనంతపురం లో ఇద్దరు చైన్ స్నాచర్లను మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారు నేరాలకు పాల్పడుతున్నారని సమాచారం అందడంతో, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన నాగార్జున రెడ్డి అలియాస్ చిన్న, భోజనాల వరప్రసాద్ అలియాస్ ప్రసాద్ వారి నుంచి దొంగలించిన నాలుగు లక్షల విలువ చేసే బంగారు గొలుసులు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో అనంతపురం మూడవ పట్టణ సీఐ కే శాంతి లాల్ వచ్చిన సమాచారం మేరకు సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వారి సిబ్బంది అనంతపురం పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుండి నాలుగు లక్షల విలువ చేసి 23 గ్రాముల బంగారు చైను, 1.5 గ్రాము బంగారు లక్ష్మీకాసు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గత నెల జూన్ 21వ తేదీన స్థానిక నేషనల్ పార్క్ ఎదురుగా స్కూటీపై ఇద్దరు మహిళలు వెళ్తుండగా వారిని అనుసరించి వీరిద్దరు మోటార్ సైకిల్ పై వెళ్లి స్కూటీ నడుపుతున్న వారికి వెనుక చక్రంలో గాలి తగ్గిందని చెప్పక ఆమె తన స్కూటీని ఆపి కిందకు దిగి వెనుక చక్రం వైపు చూస్తుండగా ఆమె మెడలో ఉన్న బంగారు తాళిబొట్ల చైను ను లాక్కొని ఉడాయించారు. ఎట్టకేలకు వీరిని మూడవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి అంగరంగ వైభవంగా వేడుకలు





**గుత్తి - సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** గుత్తి మండలంలోని కె.ఉబిచర్ల గ్రామంలో శ్రీకృష్ణుని వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదట శ్రీకృష్ణుని ప్రతిమాకి అభిషేకం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను అర్పించారు. శ్రీకృష్ణుని ఆటపాటలు నృత్యాలతో, శ్రీకృష్ణుని నామాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పల్లకి మీద శ్రీకృష్ణుడుని వుంచి యువకులు, చెక్క భజనలతో, శ్రీకృష్ణుని నామాలతో గ్రామంలో పూలు చల్లుతూ కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల ప్రభోదనందా శిశువులు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# యువ హీరో అప్పుడే విలన్ అయ్యాడా?




# నిజాలు చూపించే చిత్రం 'యూనివర్శిటీ

ఆర్.నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో నటించి, నిర్మించిన 'యూనివర్సిటీ : పేపర్ లీక్' చిత్రం ఆగస్ట్ 22న విడుదల కాబోతోంది. తాజాగా ఈ సినిమాని బ్రహ్మానందానికి చూపించారు. ఈ సందర్భంగా నారాయణ మూర్తి మాట్లాడుతూ, తెలుగు సినిమా రంగంలో అలనాటి ప్రముఖ హాస్యనటుల తర్వాత ఇప్పుడు బ్రహ్మానందం ఎరా నడుస్తుందని అన్నారు. సినిమా చూసిన తర్వాత బ్రహ్మానందం మాట్లాడుతూ, 'నారాయణమూర్తి తేనెటీగ లాంటి వాడు. తిరుగుతూ తిరుగుతూ ఉంటాడు. అన్ని చోట్ల తేనె పోగుచేసుకుని వచ్చి తలా ఒక చుక్క పంచి పెడుతుంటాడు. నా దృష్టిలో ఆయన అందమైన హీరో. ఒకసారి మదర్ థెరిస్సాను 'మీ దృష్టిలో అందమైన వ్యక్తి ఎవరు?' అని అడిగితే, 'ఎవరి మనసులో సేవాభావం ఉంటుందో, ఎవరి కళ్ళలో దయా గుణం ఉంటుందో ఆ జీవి అందంగా కనిపిస్తుంది' అని చెప్పారు. నలభై యేళ్ళుగా నారాయణమూర్తి నాకు తెలుసు. నిరంతరం ప్రజలు, అందునా పేద ప్రజల పక్షాన నిలిచే వ్యక్తి ఆయన. ఈ సినిమా చూసిన తర్వాత నేను ఎంతో ఎమోషన్ కు గురయ్యాను. ఇవాళ మన దేశంలో ఎడ్యుకేషన్ సిస్టమ్ ఎలా ఉందో ఎంతో స్టడీ చేసి నారాయణమూర్తి ఈ సినిమా తీశాడు. ఇది వాస్తవానికి దూరంగా ఉన్న సినిమా కాదు. ఇది ఊహించుకున్నటువంటి ఒక సుందరాంగి సినిమా కాదు. ఇందులో నిజాలుంటాయి, వెతుక్కోండి. ఇందులో బూతులు ఉండవు.

జీవితపు లోతులు వుంటాయి, వెతుక్కోండి. కొన్ని డైలాగ్స్ అద్భుతంగా ఉన్నాయి. డబ్బు కోసం కాకుండా నిజాయితీగా తను అనుకున్న దాని చెప్పాలని తీసిన 'యూనివర్సిటీ' సినిమా చూడండి. పేపర్ లీకేజీ సమస్యను చాలా చక్కగా ఇందులో వివరించారు. ఇలాంటి వారు వ్యక్తులు కాదు శక్తులు. గోదావరి భాషలో చెప్పాలి అంటే పులస చేపలాంటి వాళు ృ. పులస చేప నదికి ఎదురు ఈదుతుంది. నారాయణమూర్తి కూడా అంతే. ఇలాంటి అద్భుతమైన సినిమాలు నారాయణమూర్తి మరిన్ని తీసి ప్రజల ఆశీర్వాదాలతో చిరస్థాయిగా ఉండాలి అని కోరుకుంటున్నాను' అన్నారు.

క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పరిచయమైన సుహాస్ హీరోగా ప్రమోట్ అయిన సంగతి తెలిసిందే. అలాగని హీరో పాత్రలకే పరిమితం కాలేదు. హీరోగా వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూనే స్టార్ హీరోల చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నాడు. ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా కెరీర్ ప్రారంభించి హీరో అయిన నటుడు సుభాష్. దీంతో కెరీన్ ను అంతే జాగ్రత్తగా ప్లాన్ చేసుకుని ముందుకెళ్తున్నాడు. ఫేం ఉన్నంత కాలమే అవకాశాలు వస్తాయన్న విషయాన్ని గ్రహించిన సుహాస్ ఆ క్రేజ్ ని తెలివిగా ఎన్ క్యాష్ చేసుకుంటున్నాడు. తాజాగా ఈ యంగ్ హీరో అప్పుడే కోలీవుడ్ లో విలన్ గా మారిపోయాడు. సెల్ఫీఫేం మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో మండాడిఅనే సినిమా తెరకెక్కుతోంది. ఇందులో సూరి హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాలోనే సుహాస్ హీరోగా నటిస్తున్నాడు. సుహాస్ పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ అయిన పోస్టర్ తో విషయం వెలుగులోకి వచ్చింది. తాను విలన్ గా నటిస్తున్నాడు? అన్న సంగతి ఇంత వరకూ ఎక్కడా రివీల్ చేయలేదు. నేరుగా పోస్టర్ తోనే అభిమానుల్ని సర్ ప్రైజ్ చేసాడు. దీంతో సోషల్ మీడియాలో నెటి జనులు సుహాస్ కి విషెస్ తెలియజేస్తున్నారు. ఇండస్ట్రీలో తెలివైన గేమ్ ఆడుతున్నాంటూ పోస్టులు పెడుతున్నారు. సుహాస్ తరహాలోనే కార్తికేయ గుమ్మడి కొండ కూడా కోలీవుడ్ లో విలన్ గా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అందులో హీరో అజిత్. అతడికి ప్రత్యర్ధి పాత్రలో నటించి మెప్పించాడు. అదే తమిళ్ లో తొలి సినిమా. కానీ ఆ తర్వాత కార్తికేయకు కోలీవుడ్ లో విలన్ అవకాశాలు రాలేదు. మరి సుహాస్ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. సుహాస్ తమిళ పరిశ్రమకు తగ్గ నటుడే. అతడి ఆహార్యం తమిళ సినిమాలకు పర్ఫెక్ట్ గా సూటువుతుంది. సాధారణంగా తమిళంలో తెలుగు నటులకు అవకాశాలు రావడం చాలా అరుదు. అక్కడ ప్రాంతం ఆధారంగా ఛాన్సులిస్తుంటారనే విమర్శ ఉంది. గతం కంటే ఇప్పుడు మెరుగ్గానే పరిస్థితి ఉంది.



## టీమిండియా ఎంపిక..

# కెప్టెన్‌గా సూర్య కుమార్ యాదవ్

- వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్
- శ్రేయస్, జైస్వాల్‌కు మొండిచేయి
- జశ్‌ప్రీత్ బుమ్రానే పేస్ దళపతి

**ముంబయి :** 2025 ఆసియా కప్‌కు భారత జట్టును ఎంపిక చేసిన బీసీసీఐ ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ.. 2026 ఐసీసీ టీ20 ప్రణాళికలను సైతం ఆవిష్కరించింది. వచ్చే ఏడాది టైటిల్ డిఫెన్స్‌లో భాగంగా 16-17 మంది క్రికెటర్లతోనే పొట్టి ఫార్మాట్‌లో నిలకడగా ఆడాలనే ప్రణాళికతో ఉన్నామని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. దీంతో టీ20 ఫార్మాట్‌లో గొప్పగా రాణిస్తున్న శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్‌కు ప్రపంచకప్ ప్రణాళికల్లోనూ చోటు లేదని తేలిపోయింది!. ఐపీఎల్ ఫామ్, టెస్టు కెప్టెన్సీ ప్రభావంతో శుభ్‌మన్ గిల్ అలవోకగా టీ20 జట్టులోకి వచ్చేశాడు. పొట్టి ఫార్మాట్‌లో చోటుతో పాటు వైస్ కెప్టెన్సీ సైతం శుభ్‌మన్ గిల్ దక్కించుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో 15 మందితో కూడిన భారత జట్టు ఆసియా కప్‌లో పోటీపడనుంది. భారత్ ఆతిథ్యం ఇస్తున్న 2025 ఆసియా కప్ పాకిస్తాన్‌తో ఒప్పందం కారణంగా తటస్థ వేదిక యుఏఈలో జరుగనుంది. సెప్టెంబర్ 9 నుంచి ఆరంభం కానున్న ఆసియా కప్‌లో భారత్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఆలస్యంగా ముంబయికి చేరుకోవటంతో సెలక్షన్ కమిటీ సమావేశం సైతం షెడ్యూల్ సమయానికంటే ఆలస్యంగా ఆరంభమైంది. వర్షం కారణంగా దేవజిత్ ప్రయాణిస్తున్న విమానాన్ని అహ్మదాబాద్‌కు మళ్లించారు. అహ్మదాబాద్ నుంచి మళ్లీ ముంబయి చేరుకునేందుకు ఆలస్యమైంది. మహిళల సెలక్షన్ కమిటీ సమావేశం సైతం ఆలస్యంగానే మొదలైంది.

**ఆసియా కప్‌కు భారత జట్టు :** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), హార్దిక్ పాండ్య, అర్ష్‌దీప్ సింగ్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, శివం దూబె, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, జశ్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రానా, రింకూ సింగ్, సంజు శాంసన్.స్టాండ్‌బై ఆటగాళ్లు : ప్రసిద్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్.



# షెఫాలీకి నిరాశ

రేణుక సింగ్ పునరాగమనం - వన్డే వరల్డ్‌కప్‌కు భారత మహిళల జట్టు

**ముంబయి :** ఐసీసీ మహిళల 2025 వన్డే వరల్డ్‌కప్ భారత జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. యువ ఓపెనర్, ధనాధన్ హిట్టర్ షెఫాలీ వర్మకు సెలక్షన్ కమిటీ మొండిచేయి అందించింది. డబ్ల్యూపీఎల్ 2025 సహా ఇటీవల భారత్-ఏ తరఫున ఆసీస్‌లో నిలకడగా రాణించిన షెఫాలీ వర్మ సెలక్షన్ కమిటీ, జట్టు మేనేజ్‌మెంట్ నమ్మకాన్ని పొందలేకపోయింది. షెఫాలీ వర్మ లేని వేళ టీమ్ ఇండియాకు వన్డేలో రాణించిన యువ ఓపెనర్ ప్రతిక రావల్‌తోనే సెలక్షన్ కమిటీ ముందుకెళ్లింది. 15 మందితో కూడిన భారత జట్టును బీసీసీఐ ఆల్ ఇండియా మహిళల సీనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియాలు చీఫ్ సెలక్టర్ నీతూ డెవిడ్ అధ్యక్షతన జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ సెప్టెంబర్ 30 నుంచి భారత్ వేదికగా ఆరంభం కానున్న సంగతి తెలిసిందే.




**ఆ ఇద్దరు ఇన్:** ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న పేసర్ రేణుక సింగ్ ఠాకూర్, ఆల్‌రౌండర్ అమన్జోత్ కౌర్‌కు భారత ప్రపంచకప్ జట్టులో చోటు లభించింది. యువ ఓపెనర్ షెఫాలీ వర్మ ఇటీవల ఫామ్ చాటుకున్నా.. ఆమెకు నిరాశ తప్పలేదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతీ మంధానకు తోడు ప్రతిక రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రొడ్రిగస్ బ్యాటింగ్ లైనప్‌లో నిలిచారు. రిచా ఘోష్, యస్టికా భాటియాలు వికెట్ కీపర్లుగా ఎంపికయ్యారు. బౌలింగ్ విభాగంలో హైదరాబాదీ అరుంధతి రెడ్డి, రేణుక సింగ్ ఠాకూర్, క్రాంతి గౌడ్, రాధ యాదవ్, శ్రీ చరణి, స్నేహ్ రానాలు నిలిచారు.

**ఆసీస్‌తో సిరీస్‌కు ఒక్క మార్పు:** సెప్టెంబర్ 14-20న భారత్, ఆస్ట్రేలియా అమ్మాయిలు మూడు మ్యాచుల వన్డే సిరీస్ ఆడనున్నారు. తొలి రెండు వన్డేలు న్యూ చంఢగీడ్ (ముల్లాన్‌పూర్)లో జరుగనుండగా.. ఆఖరు వన్డే న్యూఢిల్లీలో షెడ్యూల్ చేశారు. మహిళల ప్రపంచకప్ ముంగిట హర్మన్‌ప్రీత్ సేన ఈ సిరీస్‌ను సన్నాహకంగా భావిస్తోంది. ఆల్‌రౌండర్ అమన్జోత్ కౌర్ బెంగళూర్‌లోని సీఓఈలో ఫిట్‌నెస్ మెరుగుపర్చుకుంటోంది. దీంతో ఆసీస్‌తో సిరీస్‌లో అమన్జోత్ కౌర్ ఆడటం లేదు. ఆమె స్థానంలో సయాలి ఆసీస్‌తో సిరీస్‌లో ఆడనుంది. ప్రపంచకప్ వార్మప్ మ్యాచుల్లో అమన్జోత్ కౌర్ బరిలోకి దిగుతుంది.

**ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు భారత మహిళల జట్టు :** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతీ మంధాన (వైస్ కెప్టెన్), ప్రతిక రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రొడ్రిగస్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), రేణుక సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, అమన్జోత్ కౌర్, రాధ యాదవ్, యస్టికా భాటియా (వికెట్ కీపర్), శ్రీ చరణి, స్నేహ్ రానా.స్టాండ్ బైలు : తేజల్, ప్రేమ రావత్, ప్రియ మిశ్రా, ఉమ ఛెత్రి, మిన్ను మణి, సయాలి.

### సోషల్ మీడియాలో

# అసత్య ప్రచారాలు చేసేవారిపై చర్యలు

- అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం
- వాస్తవాలను తెలియజేసేందుకు ప్రత్యేకంగా ఒక ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు చేస్తాం
- అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరిస్తూ ప్రజలను అభద్రతాభావానికి గురి చేస్తున్నారు
- ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసే రీతిలో సోషల్ మీడియాలో లేనిపోని ఆరోపణలు
- సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేస్తే తట్టుకోలేక లేనిపోని ఆరోపణలు
- శ్రీకాంత్ పేరోల్ రద్దు చేసి తిరిగి జైలులో పెట్టాం, దానిపై విచారణ
- రాష్ట్ర హోంశాఖామంత్రి వంగలపూడి అనిత





**అమరావతి – సూర్య వాస్తవం, ఆగస్టు 19:** సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి అభద్రతా భావానికి గురిచేసే వారిపై ఇకపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందని దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురానున్నట్టు రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖామంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర సచివాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడమే గాక అభధ్రతా భావానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇకపై అలాంటి దుష్ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఒక ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసి వాస్తవాలేమిటో ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. అమరావతి మునిగిపోయిందని, విజయవాడ ప్రకాశం బ్యారేజి గేట్లు పనిచేయడం లేదని పలు అసత్య ప్రచారాలను సోషల్ మీడియాలో ఇష్టారీతిన ప్రసారం చేస్తూ ప్రభుత్వంపై మూకుమ్మడి దాడి చేస్తున్నారని ఇకపై అలాంటి తప్పుడు వార్తల ప్రసారాలను సమర్ధవంతంగా తిప్పకొట్టడం తోపాటు అందుకు కారకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి అనిత స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ విజయవంగా అమలు చేయడంతో ప్రతిపక్ష పార్టీ తట్టులేక పోతోందని, అందుకే సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాన్ని చేస్తోందని హెూం మంత్రి అనిత విమర్శించారు. ఇది ఆ పార్టీకి వారసత్వంగా వచ్చిన సమస్యగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. ఒక్క ఆగష్టు నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నేతన్నలకు, నాయి బ్రాహ్మణులకు 200 వరకూ ఉచిత విద్యుత్, స్త్రీశక్తి పథకం కింద మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని అన్నారు. నాలుగు రోజుల్లో సుమారు 20 లక్షల మందికి పైగా మహిళలు ఉచిత బస్సుల్లో ప్రయాణించి సుమారు రూ.20 కోట్ల వరకూ లబ్ది పొందారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంటే ఎపి బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బతీసే విధంగా ప్రతిపక్ష వైసిపి వారి అనుబంధ మీడియా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అనిత పేర్కొన్నారు. ఎపి బ్రాండ్ ఇమేజ్ గురించి మాట్లాడాలంటే ముందుగా గుర్తువచ్చేది సీఎం చంద్రబాబు నాయుడేనని అలాంటి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడమేమిటన్నారు. అమరావతిపై లేనిపోని రాతలు రాసేవారిపై కేసులు పెడతామని ఆనాడు రఘురామ కృష్ణ రాజుపై కాదు.. ఈనాడు మీరు పెడుతున్న తప్పుడు పోస్టులపై రాజద్రోహం కేసులు పెట్టాలని అన్నారు. ఇకపై ఇలాంటి తప్పుడు పోస్టులు పెట్టవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సియం స్పష్టం చేశారని మంత్రి అనిత పునరుద్ఘాటించారు. అసాంఘిక శక్తులను ఎలా అరికట్టాలో చంద్రబాబుకు బాగా తెలుసని, అలాంటి శక్తులపై ఉక్కుపాదం మోపుతామని, శాంతిభద్రతల విషయంలో రాజీలేదు హెూం మంత్రి అనిత స్పష్టం చేశారు.

**శ్రీకాంత్ అనే వ్యక్తి పేరోల్ రద్దు చేశాం**
**-ప్రస్తుతం జీవితఖైదు అనుభవిస్తున్నాడు: మంత్రి అనిత**

పేరోల్ రావడం వెనుక ఏముంది ఎవరున్నారనే దానిపై పూర్తిగా విచారణ జరుపుతున్నామని ఈసంఘటనలో ఎవరున్నా వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెూంమంత్రి అనిత స్పష్టం చేశారు. శ్రీకాంత్ విషయంలో ఎస్కార్ట్ సిబ్బందిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రిమినల్ రికార్డు ఉన్న వ్యక్తికి పెరోల్ వచ్చిందని జైలు అధికారి చెప్పారని, వెంటనే అతని పెరోల్ రద్దు చేసి తిరిగి జైలుకు పంపామని అన్నారు. ఈ ఘటనలో పోలీస్ అధికారులు ఎవరున్నా వారిపై కూడా విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అరుణ అనే మహిళ దిశా ఫౌండేషన్ కు సెల్ఫ్ డిక్లేర్డ్ సెక్రటరీ అని ఆమె నుంచి హెూంశాఖ పేషీకి ఫోన్ వచ్చిందని దానిపై కూడా దర్యాప్తు చేస్తున్నామని ఆమె గురించి ఆమె వెనుకున్న వారి గురించి ఆరా తీస్తున్నాని తెలిపారు.

# అవినాష్ స్థానంలో సతీష్...

**కడప– సూర్య వాస్తవం:** సొంత నియోజకవర్గంలో జగన్మోహన్ రెడ్డికి గట్టి షాక్ తగిలింది. పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి ఘోరంగా ఓడిపోయారు. కనీసం ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదు. టిడిపి అభ్యర్థికి ఆరువేలకు పైగా ఓట్లు వస్తే.. వైసీపీ అభ్యర్థికి 600 ఓట్లు మాత్రమే వచ్చాయి. పూర్తిగా అధికార దుర్వినియోగంతో టిడిపి గెలిచిందని వైసీపీ చెబుతోంది. అయితే పులివెందుల ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయడంతోనే తమకు సంపూర్ణ విజయం తగ్గిందని టిడిపి చెబుతోంది. అయితే వైసిపి ఆరోపిస్తున్నట్టు అధికార దుర్వి నియోగం జరిగినా.. ప్రజలు ఈ స్థాయిలో తిరస్కరించడం మాత్రం వైసీపీకి మింగుడు పడడం లేదు. మరోవైపు భవిష్యత్తుపై ఆ పార్టీకి బెంగ కనిపిస్తోంది. స్వయంగా పార్టీ అధ్యక్షుడు నియోజకవర్గంలోనే ఓటమి ఎదురైందంటే.. మిగతా చోట్ల ఎలా ఉంటుందోనన్న చర్చ నడుస్తోంది. ఈ తరుణంలో సొంత జిల్లాలోని మార్పులకు జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.మొన్నటి సాధారణ ఎన్నికల్లో కడప జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం ఎదురయింది. పది అసెంబ్లీ స్థానాలకు గాను ఏడింట కూటమి విజయం సాధించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. రాజశేఖర్ రెడ్డి హవా ప్రారంభం అయిన తర్వాత కడప జిల్లా పై పూర్తి పట్టు




కొనసాగుతూ వచ్చింది. అటువంటిది తొలిసారి భారీ ఓటమి ఎదురు కావడం ఆ పార్టీని ఆందోళనలో నెట్టింది. ముఖ్యంగా పులివెందులలో ఏకపక్షంగా గెలుపొందుతూ వస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఎప్పుడూ రికార్డ్ స్థాయి మెజారిటీ సాధిస్తూ వచ్చింది. అటువంటిది ఓట్ల విషయంలో ఘోరంగా వైఫల్యం చెందడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. 2029లో ఇదే తరహా ప్రభావం ఉంటే మాత్రం ప్రమాదం తప్పదని అంచనా వేస్తోంది.మరోవైపు వివేకానంద రెడ్డి హత్య అంశం పులి వెందులలో కచ్చితంగా పనిచేస్తుంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల కంటే.. జడ్పిటిసి ఉప ఎన్నికల్లోనే ఇది స్పష్టంగా కనిపించింది. అందుకే జగన్మోహన్ రెడ్డి జాగ్రత్త పడాల్సి వచ్చింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయనే పులివెందుల నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉన్న ఐదేళ్లు ఇన్చార్జిగా ఆయనే కొనసాగారు. ఇప్పుడు కూడా ఆయనే కొనసా గుతున్నారు. అయితే పులివెందుల నియోజక`వర్గంలో వివేకానంద రెడ్డి హత్య అంశం బాగా ప్రజల్లో ఉంది. అందుకే అవినాష్ రెడ్డి ఉంటే ఇబ్బందికర పరిస్థితులు తప్పవని జగన్ భావిస్తున్నారు. అందుకే ఆ నియోజకవర్గ బాధ్యతల నుంచి అవినాష్ రెడ్డిని తప్పి స్తున్నట్లు తెలుస్తోంది.పులివెందులలో అవినాష్ రెడ్డి స్థానంలో సతీష్ రెడ్డిని జగన్ తెస్తారని తెగ ప్రచారం జరుగుతోంది. గతంలో చాలాసార్లు పులివెందుల నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేశారు సతీష్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నాటి నుంచి జగన్మోహన్ రెడ్డికి పూర్తి విధేయుడుగా ఉంటున్నారు. ఆపై నియోజకవర్గంపై పట్టు ఉంది. అందుకే ఆయనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. అదే సమయంలో అవినాష్ రెడ్డికి జమ్మలమడుగు కానీ.. మైదుకూరు కానీ బాధ్యతలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# అమ్మకానికి జగన్ అన్న ఇళ్లు

**గుంటూర–సూర్య వాస్తవం:**
గత ప్రభుత్వం పేద ప్రజలకు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. ఆ స్థలాల్లో ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం అందించింది. పెద్ద పెద్ద కాలనీలను ఏర్పాటు చేసి వాటికి జగనన్న కాలనీలు అని పేరు పెట్టారు. అయితే సాధారణ ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జగనన్న కాలనీల్లో పనులు ఎక్కడవక్కడే నిలిచిపోయాయి. ఈ కాలనీల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలంటే చాలా పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. దీంతో కాలనీల్లో మౌళిక సదుపాయాలలేమితో ఇళ్లలో ఉండేందుకు స్థానికులు ఇష్టపడటం లేదు. ఈ క్రమంలోనే తెనాలి పట్టణ పరిధిలోని నేలపాడు జగనన్న కాలనీలో ఉన్న ఇంటిని ఓ లబ్దిదారుడు ఏకంగా ఓఎల్ఎక్స్‌లో విక్రయానికి పెట్టడం ఆసక్తికరంగా మారింది. అప్పులు చేసి నిర్మించుకున్న ఇంటిలో ఉండలేక ఇంటిని అమ్మేస్తున్నట్లు లబ్దిదారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే నేలపాడు కాలనీకిలో ఓ ఇంటిని తొమ్మిది లక్షల రూపాయలకు బేరం పెట్టారు.

అయితే ఏకంగా ఓఎల్ఎక్స్ లో విక్రయానికి పెట్టడంపై తెనాలి పట్టణంలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. గతంలోనే చాలామంది తమకు వచ్చిన ఇంటి స్థలాలను విక్రయించుకున్నారు .ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ ధరకు ఇల్లు, ఇంటి స్థలాలు వస్తుండటంతో కొంతమంది కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు.

## ఉరేసుకుని భువన కార్మికుడు ఆత్మహత్య



**మదనపల్లె – సూర్య వాస్తవం, ఆగస్టు 19 :** కుటుంబ సమస్యలతో భవన నిర్మాణ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. మృతిని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కొత్తపల్లి పంచాయతీ, కొత్తిండ్లుకు చెందిన కటారి రమేష్ (45) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తు న్నాడు. ఇతనికి భార్య ప్రమీల, కుమార్తె అనుష్క, కుమారుడు క్రాంతి ఉన్నారు. మద్యానికి బానిసైన రమేష్ తరచూ భార్య పిల్లలతో గొడవపడేవాడు. ఈ క్రమంలో మద్యం తాగి ఇంటికి వచ్చిన రమేష్ భార్యతో గొడవపడి ఇంట్లోకి వెళ్లి తలుపేసుకున్నాడు. ఎంత సేపటికి తలుపు తీయలేదు. క్రాంతి, చుట్టుపక్కల వారు తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ ఉన్నాడు. వెంటనే ఉరిని తప్పించి హుటాహుటినస్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించే లోపే మృతి చెందాడు.

## ఉత్తమ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**నాయుడుపేట –సూర్య వాస్తవం, ఆగస్టు 19:** వృత్తిరీత్యా విశిష్ట సేవలు అందించి 79వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఉత్తమ ఎంపీడీవో అవార్డు,ప్రశంసా పత్రం అందుకున్న నాయుడుపేట ఎంపీడీవో కే సురేష్ బాబును నాయుడుపేట ఎంపీపీ గురుకుల ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ఎంపీడీవో కె సురేష్ బాబుకు శాలువాలు కప్పి,పూలమాలలు వేసి,సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మల్లు గోపాల్, కార్యదర్శులు గోవిందయ్య,భారతి, సుజాత,వెంకటేశ్వర్లు,నరేష్ ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వినాయక విగ్రహాల ఏర్పాటుకు

## అనుమతులు తప్పనిసరి

### - సీఐ సంగమేశ్వరరావు



**పెళ్లకూరు– సూర్య వాస్తవం, ఆగస్టు 19:** వినాయక చవితి సందర్భంగా మండలవ్యాప్తంగా విగ్రహాల ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పెళ్లకూరు సీఐ సంగమేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక ఉత్సవాల కమిటీలతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ... విగ్రహాల ఏర్పాటు కోసం పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకోవాలని సూచించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. విగ్రహాల వద్ద నిమజ్జనం వరకు రాత్రివేళల్లో కాపలా విధులు ఉండేలా కమిటీలు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పెళ్లకూరు ఎస్సై కె. నాగరాజు కూడా పాల్గొన్నారు

## మున్సిపల్ కమిషనర్‌కి జన్మదిన శుభాకాంక్షలు



**నాయుడుపేట –సూర్య వాస్తవం, ఆగస్టు 19:** తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్. ఫజులుల్లాకి మున్సిపల్ ఉద్యోగులు సిబ్బంది భారీగా జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. 20వ తేదీ బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా ఆయనకు ముందుగా జన్మదిన శుభాకాంక్షలు పలువురు తెలియజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఉద్యోగులుమాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీకి ఎంతోమంది కమిషనర్ లు వచ్చారు కానీ గ్రేడ్ వన్ ఆఫీసర్ షేక్. ఫజులుల్లా నాయుడుపేట మున్సిపాలిటీకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనుభవం ఉన్న ఆఫీసర్ వద్ద పనిచేయటం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఇలాంటి ఆఫీసర్లు ఉంటే తెలియని పనులు కూడా సులభంగా తెలుసుకోవచ్చని వారు అన్నారు. షేక్. ఫజులుల్లా ఆఫీసర్ నాయుడుపేటకి రావడంతో సంత మున్సిపల్ కార్యాలయాన్ని నూతనంగా నిర్మించడానికి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ప్రశాంతమైన వాతావరణంలో నూతన భవనం ఏర్పాటుకు ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని మున్సిపాలిటీకి ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ ఉద్యోగులు మేనేజర్ ఊరుకుందమ్మ. గాయత్రి. గోవర్ధన్. ఉమయన్ భాషా. సచివాలయ సిబ్బంది. శ్రావణి. తదితర ఉద్యోగులు ఆయనకు ముందుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపినట్లు సమాచారం.


PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )